

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

మంగళవారం, 18 నవంబర్ 2025 — 8 పేజీలు

ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లా ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ఫిర్యాదులను చట్ట పరిధిలో ఉంటే జాప్యం లేకుండా పరిష్కరించాలని ఎస్పీ ధీరజ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం ప్రజల సమస్యలను నేరుగా విని, జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను స్వీకరించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, భూ-ఆస్థి వివాదాలు, ఇతర సమస్యలపై ఎస్పీ స్వయంగా విచారణ జరిపారు. ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, చట్టపరిదిలో తక్షణ న్యాయం అందించాలని ఆదేశించారు. చట్టపరమైన చర్యలు తీసుకున్న వెంటనే, వివరాలతో కూడిన నివేదికలను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలి అని స్పష్టం చేశారు.

న్యాయవాదుల హక్కుల కోసం

నిరంతర పోరాటం

- ఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని

విశాలాంధ్ర-కడప రూరల్: రాష్ట్రంలోనూ దేశంలోనూ అపరిష్కృతంగా ఉన్న న్యాయవాదుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ కార్యదర్శిఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్ కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎన్నికలు సందర్భంగా అన్నమయ్య కడప జిల్లాలలోఆయన 17న పర్యటన చేశారు. ఈ సందర్భంగా కడప న్యాయవాదులను ఉద్దేశించి కోర్ట్ ఆవరణంలో మాట్లాడారు. 1982లో జస్టిస్ కృష్ణయ్యర్ ఆధ్వర్యంలో దేశంలో ఏర్పడిన భారత న్యాయవాదుల సంఘం అప్పటినుండి న్యాయవాదుల సమస్యల పట్ల అంకితభావంతో పనిచేస్తూ రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ సేవా భవంతో ఐఏఎల్ ముందుకు కొనసాగుతుందని రాష్ట్రంలోని న్యాయవాదుల అనేక సమస్యలను పరిష్కరించడంలో ఐఏఎల్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా కృషి చేస్తుందని న్యాయవాదులు తమకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చి బార్ కౌన్సిల్ సభ్యుడుగా మళ్లీ తనను గెలిపించినట్లయితే న్యాయవాదుల హక్కుల కోసం మరింతగా కృషి చేస్తానని న్యాయవాదులకు హామీ ఇచ్చారు.

'కృత్రిమ' యుగం

- మెదడుకు మేత
- సాంకేతిక బోధ
- మానవ మేధస్సుకు ప్రత్యామ్నాయం
- ఆలోచించే యంత్రాల యుగం

విశాలాంధ్ర-పులివెందుల: కృతయుగంలో మొదలైన కాలమానం కలియుగంలో కృత్రిమ దశకు చేరింది. తాజా యుగంలో ప్రపంచాన్ని ఊపేస్తున్న పదం 'కృత్రిమ మేధ' మానవ మేధస్సును అనుకరించగల కంప్యూటర్లు, రోబోలు, సాఫ్ట్‌వేర్‌లు వంటి సాంకేతిక పరికరాల సమాహారం ఇది. మనిషి మాదిరిగా ఆలోచించే, నేర్చుకునే, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం కలిగిన యంత్రాలు ఇవి. కృత్రిమ మేధ సాయంతో వైద్య, వ్యవసాయ, వ్యాపార, విద్య రంగాలలో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. రోగాల నిర్ధారణ, పంటల అంచనా, ట్రాఫిక్ నియంత్రణ, డేటా విశ్లేషణ వంటి ఎన్నో పనులు క్షణాల్లో పూర్తవుతున్నాయి. కస్టమర్ సేవలు, మొబైల్ అప్లికేషన్లు, వాయిస్ అసిస్టెంట్లు వంటి రోజువారీ అవసరాల్లో కూడా ఇది భాగమవుతోంది.

ప్రధాన విధానాలు:

కృత్రిమ మేధస్సు మూడు ప్రధాన విధానాలపై ఆధారపడి ఉంది. యంత్ర అధ్యయనం, లోతైన అధ్యయనం, సహజ భాషా ప్రక్రియ, వీటిలోని సాంకేతికతలతో యంత్రాలు మానవుల మాదిరిగా భాషను అర్థం చేసుకుని ప్రతిస్పందించగలుగుతున్నాయి.

నిపుణుల మాటల్లో..

కృత్రిమ మేధ వినియోగం జాగ్రత్తగా జరగాలి. ఎందుకంటే సాంకేతిక అభివృద్ధితో పాటు భద్రతా సమస్యలు, ఉద్యోగ అవకాశాల తగ్గుదల వంటి సవాళ్లు కూడా ఎదురుకావచ్చు. సరైన నియంత్రణతో వినియోగిస్తే ఇది మానవ అభివృద్ధికి గొప్ప సాధనమవుతుందని నిపుణులు సూచిస్తున్నారు.

ఆంధ్రావనిలో 'బోధ' మార్పు

ప్రాచీన గ్రంథాల్లో మనుషుల జీవితాన్ని నాలుగు యుగాలుగా వర్ణించారు. కృత, త్రేత, ద్వాపర, కలి. అందులో కృతయుగం పవిత్రత, సత్యం, ధర్మం, సహజజీవనానికి ప్రతీకగా నిలిచింది. ఈ యుగంలో మనిషి ప్రకృతితో ఏకీభవించి జీవించేవాడని పురాణాలు చెబుతాయి. అదే యుగం నేటి కాలంలో కొత్త నిర్వచనంతో ముందుకు వస్తోందని విమర్శకులు వ్యాఖ్యానిస్తున్నారు. కృతయుగంలో రాజులు ప్రజలను స్వయంగా కలుసుకుని ధర్మబద్ధంగా పాలించేవారని ఇతిహాసాలు చెబుతాయి. నేటి పరిస్థితుల్లో ఆ సత్యధర్మాలు తిరిగి రావాలి అని పౌర సమూహాలు కోరుతున్నాయి. ప్రకృతికి దగ్గరగా ఉన్న జీవనశైలి, వాస్తవ సమస్యలకు సూటి పరిష్కారాలు, పరిపాలనలో నిజాయితీ తిరిగి స్థాపించాల్సిన అవసరం ఉంది.

ప్రజాభిప్రాయం

అభివృద్ధి పేరుతో కృత్రిమ ప్రయోగాలు కాకుండా, జీవనానికి అవసరమైన నీరు, విద్య, వైద్యం, వ్యవసాయం వంటి అసలు అంశాలపై దృష్టి పెట్టాలి" అని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

సమస్యల పరిష్కారంలో

నిర్లక్ష్యం తగదు

- జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

విశాలాంధ్ర-రాయచోటి: ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ హెచ్చరించారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సకాలంలో, నాణ్యతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం పిజిఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రాయచోటి ఆర్డీవో శ్రీనివాస్, జిఎస్ డబ్ల్యూ ఎస్ లక్ష్మీపతి, డిపిఓ రాధమ్మ, హౌసింగ్ పీడీ రమేష్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పొద్దుటూరు: జిల్లా ఆసుపత్రిని 350పడకల ఆసుపత్రిగా ఏర్పాటు చేయడం ఎంతో హర్షనీయం అని ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి పేర్కొన్నారు. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి చేతుల మీదుగా అభివృద్ధి పనులకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం జిల్లా ఆసుపత్రిలో జిల్లా ఆసుపత్రిని అప్ గ్రేడ్ చేస్తూ 350పడకల మార్పు చేయడం, ఈ ఆసుపత్రికి 4 నియోజికవర్గాలకు అనుసంధానంగా ఆయా నియోజక వర్గాల ప్రజలు ఆసుపత్రి సేవలు పొందుతున్నారని తెలిపారు. దాదాపు రూ.14కోట్ల 10లక్షల వ్యయంతో 350 పడకల ఆసుపత్రిగా మారుతుందన్నారు. అలాగే 12 కోట్లతో అతి క్లిష్ట చికిత్స విభాగం(క్రిటికల్ కేర్ బ్లాక్) నిర్మించడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజల ఆరోగ్య స్థితిగతులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఆసుపత్రులలో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్లు డాక్టర్ నిరంజన్ రెడ్డి, బద్వేలి శ్రీనివాసులు రెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ అపర్ణ, మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, మాజీ మున్సిపల్ ఛైర్మెన్ ఈవి సుధాకర్ రెడ్డి, వక్ఫ్ బోర్డ్ రాష్ట్ర సభ్యులు బేపారి జాకీర్ అహమ్మద్, తలారి పుల్లయ్య, జనసేన జీలాని తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనను

విజయవంతం చేయండి

- జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో.. రాష్ట్ర ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్,జిల్లా జాయింట్ కలెక్టర్ అదితి సింగ్,అడిషనల్ ఎస్పీ ప్రకాష్ బాబు,డిఆర్వో విశ్వేశ్వర నాయుడు తో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నవంబర్ 19న పిఎం కిసాన్ పథకం- అన్నదాత సుఖీభవ రెండవ విడతలో భాగంగా రైతుల ఖాతాలలో నగదు జమ చేయనున్నాయి.. ఈ కార్యక్రమంనకు సంబంధించి రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు వైఎస్ఆర్ కడప జిల్లా కమలాపురం నియోజకవర్గం పెండ్లిమర్రి మండలంలో పాల్గొన నున్నారని తెలిపారు.

..మిగతా 2లో

జనవరిలో ఇస్తేమా

- నమాజ్ ఇస్తేమా కమిటీ కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న

- రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎండి ఫరూక్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: వచ్చే ఏడాది జనవరి 23,24,25 తేదీల్లో కడప జిల్లాలో రాష్ట్రస్థాయి ఇస్తేమా కార్యక్రమం జరగనున్న నేపథ్యంలో ఇందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎం.డి ఫరూక్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో ఇస్తేమా కార్యక్రమానికి సంబంధించిన నమాజ్ కార్యవర్గ సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఎండి ఫరూక్ హాజరుకాగా కమలాపురం ఎమ్మెల్యే పుత్త కృష్ణ చైతన్య రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డిలు హాజరయ్యారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనా థన్ పాల్గొన్నారు. మంత్రి ఎండి ఫరూక్ మాట్లాడుతూ... ఇస్తే మా కార్యక్రమాన్ని ఈసారి కడప జిల్లాలో నిర్వహిస్తున్నట్లు

..మిగతా 2లో

సెలవు రోజుల్లో ఎస్ఎస్సీ యాక్షన్ ప్లాన్ నిర్వహించలేం: ఎస్టీయు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: ఎస్ఎస్సీ పరీక్షల నేపథ్యంలో 100 రోజుల కార్యాచరణ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు భారంగా పరిణమిస్తుంది కావున సెలవు రోజుల్లో ఎస్ఎస్సి యాక్షన్ ప్లాన్ నిర్వహించలేమని ఎస్టీయు కడప జిల్లా శాఖ డీఈఓకి స్పష్టం చేసింది. కాబట్టి సెలవు రోజులను కార్యాచరణ నుంచి మినహాయించాలని ఎస్టియు కడప జిల్లా శాఖ ప్రతినిధులు డిఈఓ శంషుద్దీన్‌ని కోరారు. సోమవారం కడప డిఈఓ కార్యాలయంలో కడప జిల్లా నాయకత్వం డిఈఓని కలిసి సెలవు రోజుల్లో ఎస్ఎస్సి యాక్షన్ ప్లాన్ నుండి సెలవు రోజుల్లో మినహాయించాలని ప్రాతినిధ్యం చేశారు. రాష్ట్ర సంయుక్త అధ్యక్షులు సురేష్ బాబు మాట్లాడుతూ రాబోవు 130 రోజుల పని దినాలలో ఎస్ఎస్సీ కార్యాచరణ పేరుతో 100రోజులు ఒకే తరగతి మీద అందరి దృష్టి పెడితే మిగతా తరగతుల విద్యార్థులకు సవతి తల్లి ప్రేమలాగా బోధనలో వ్యత్యాసం చూపాలా? ఇలా ప్రతీ సంవత్సరం క్రింది తరగతులు నవంబర్, డిసెంబరు నుండి శ్రద్ధా నిర్లక్ష్యానికి గురి అవుతున్నాయని అన్నారు. జిల్లా అధ్యక్షుడు సంగమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఆదివారాలు, రెండో శనివారాలు, పండుగలు పబ్బాలు లేకుండా 24×7 రాబోవు వంద రోజులు పదవ తరగతి పిల్లలను పుస్తకాలే ప్రపంచంగా మానసిక ఊరట లేకుండా అలసటను విసుగును ఆభరణంగా చేసుకొని ఆహ్లాదకరంగా అర్థవంతంగా చదువుకోవలసిన విద్యార్థి ఒత్తిడిలో చదువుకోవాలా? ఇలాంటి విధానం సత్ఫలితాలు ఇవ్వదని తెలిపారు. విద్యార్థికి అభ్యసనా విరామం ఉండాలి. వారంతపు విరామం విద్యార్థికి మనస్తత్వ శాస్త్రం ప్రకారం ఉంటేనే ఆ విద్యార్థి నవ్యత్వంతో ఉత్సాహంగా అభ్యసన కార్యక్రమాలలో భాగస్వామి అవుతాడు. అందుకే! రాష్ట్ర విద్యాశాఖ ప్రకటించిన పదవ తరగతి కార్యాచరణ ప్రణాళికను సవరించాలని కోరారు. ఉపాధ్యాయులను కాకుండా విద్యార్థులను కూడా దృష్టిలో పెట్టుకోవాల్సిన అవసరం ఉంది. గత సంవత్సరం ఉపాధ్యాయ సంఘాలకు రాష్ట్ర ఉన్నతాధికారులు ఇచ్చిన హామీని కూడా నిలబెట్టుకోలేదని గత సంవత్సరం సెలవు రోజుల్లో కూడా ఉపాధ్యాయులు పదవ తరగతి విద్యార్థుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా పనిచేశారు. వాటికి సంబంధించి కాంపెన్జేషన్ క్యాజువల్ లీవ్స్‌ను ఇస్తామని హామీ ఇచ్చి అధికారులు మాట తప్పారు. అలాగే ఈ సంవత్సరం వేసవిలో జరిగిన పదో తరగతి సప్లమెంటరీ పరీక్షల కంటే ముందుగా విద్యార్థులకు వేసవి సెలవుల్లో రెమిడీయల్ టీచింగ్ కొరకు చాలామంది ఉపాధ్యాయులు 10 నుంచి 15రోజులు పాటు పనిచేశారు ఆ కాలానికి కూడా కాంపెన్జేషన్ సీసీఎల్ లు ఇవ్వాల్సి ఉందని, ఉపాధ్యాయులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్న రెండవ శనివారం ఆదివారాల నందు కార్యాచరణ ప్రణాళిక అమలను నిలిపివేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి పాలకొండయ్య అభిప్రాయపడ్డారు. గతంలో వలె సంక్రాంతి సెలవులు తదనంతరం ఎస్ఎస్సి కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని గత సంవత్సరం కార్యాచరణ ప్రణాళికలో హామీ ఇచ్చినటువంటి సీసీఎల్ ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని 220 పాఠశాల పని దినాలలో 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక విద్యార్థులకు ఉపాధ్యాయులకు తలకు మించిన భారంగా అవుతున్నదని అంతేకాకుండా సిలబస్ పూర్తి కావడం కష్టంగా ఉన్నదని పేర్కొంటూ వంద రోజులపాటు కాల నిర్ణయ పట్టికను మిగతా తరగతులకు పదో తరగతికి సమన్వయం చేయడం చాలా కష్టంగా ఉన్నదన్నారు. సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్షలు తదనంతరం పిటిఎం ఆ తదనంతరం కార్యాచరణ ప్రణాళిక ప్రధానోపాధ్యాయులకు, స్కూల్ అసిస్టెంట్లకు తీవ్ర పని భారంగా ఉన్నదని, కావున ప్రస్తుతం విద్యాశాఖ వెలువరించిన పదవ తరగతి పరీక్షలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక అమలు జరిపే ముందు గత సంవత్సరం ఇచ్చిన హామీ మేరకు పనిచేసిన ఉపాధ్యాయులకు లీవ్ అకౌంట్ నందు సీసీఎల్ జమ చేయాలి. అలాగే ఈ సంవత్సరం విద్యార్థులపై ఉపాధ్యాయులపై ఒత్తిడి భారాన్ని తగ్గిస్తూ సెలవు రోజుల్లో కార్యాచరణను రద్దు చేయాలని ఎస్టీయు కడప జిల్లా శాఖ పక్షాన డిమాండ్ చేస్తున్నామని కడప జిల్లా డీఈఓకి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇలియాస్ భాష, లోకేశ్వర్ రాజు, బాలగంగి రెడ్డి, రామ్మోహన, సుబ్రహ్మణ్యం, శివరెడ్డి, చెన్నకేశవరెడ్డి, చంద్రశేఖర్, మల్లేష్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, వాజిద్, సాదిక్, రాజశేఖర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మక్కా బస్సు ప్రమాద బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

విశాలాంధ్ర-కడప రూరల్: సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన మక్కా యాత్రికులు 40 మంది మృతి చెందడం పట్ల ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసి బాదుల్లా ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ గౌస్ లు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు చనిపోయినవారికి సంతాపం, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. చనిపోయిన వారిలో రెండు కుటుంబాలకు చెందిన 15మంది ఉన్నట్లు సమాచారం అని ఒక కుటుంబానికి చెందిన ఎనిమిదిమంది, మరో కుటుంబానికి చెందిన ఏడుగురు బస్సులో ప్రయాణించారు. ఈ ప్రమాదంలో మృతి చెందినవారిలో మహిళలు, చిన్నారులున్నట్లు తెలుస్తున్నది. చనిపోయినవారి భౌతిక కాయాలను వారి కుటుంబ సభ్యులకు సత్వరమే అందేట్లు కేంద్ర ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని వారి కుటుంబాలను ఆదుకునేందుకు తగిన నష్టపరిహారం ఇవ్వాల్సిందిగా కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

పలువురు కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరిక

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: కడప నగరానికి చెందిన ఐదుగురు కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎన్.డి.విజయజ్యోతి సమక్షంలో, జిల్లా జనరల్ సెక్రటరీ సయ్యద్ గౌస్ పీర్ ఆధ్వర్యంలో ఈ చేరిక కార్యక్రమం జరిగింది. 41వ డివిజన్‌కు నుంచి సయ్యద్ యాసీన్, 36వ డివిజన్‌కు నుంచి షేక్ అన్వర్‌భాష, 2వ డివిజన్‌కు నుంచి ఎస్ఎండి యూసుఫ్, 38వ డివిజన్‌కు నుంచి సయ్యద్ జాకీర్, సయ్యద్ రషీద్‌లను విజయజ్యోతి కాంగ్రెస్ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ శికిలిగిరి ఇర్ఫాన్ భాష, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు మామిళ్ళబాబు, డివిజన్ ఇన్‌చార్జులు సిద్ధిక్, ముబారక్, అట్లూరు మండల అధ్యక్షులు శ్రీలం గంగయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డును తొలగించాలి

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లి సమీపంలోని డంపింగ్ యార్డ్‌ను తొలగించాలని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆ మేరకు వేంపల్లి పంచాయతీ ఈవోకు కాంగ్రెస్ ఇన్‌చార్జి మూలంరెడ్డి ధ్రువకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ధ్రువకుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఊర్లోని చెత్తను వేంపల్లి పాపాగ్ని నది పరిసరాల్లో వేస్తున్నారని ఈవో కు ఫిర్యాదు చేశామన్నారు. గతం లో పాములురు గుట్టలో స్థలం కేటాయించారు ,కానీ అక్కడికి మార్చేందుకు ఎవేవో కారనాలు చెబుతున్నారని తెలిపారు. వెంటనే డంపు యర్డుని వూరి బయటికి మార్పు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో వేంపల్లి, చక్రాయపేట మండల అధ్యక్షులు,రామకృష్ణ, రామాంజనేయులు రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు సుబ్రమణ్యం, ఉత్తన్న, బండారు వెంకటేష్, నాగరాజు,శివ తధీతరులు వేమయ్య, ఉత్తన్న, బండారు వెంకటేష్, నాగరాజు, శివ ఉన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయండి

మొదటి పేజీ తరువాయి

నవంబర్ 19న కార్యక్రమంలో.. మొదట రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ఆర్ కడప విమానాశ్రయం నకు చేరుకొని హెలికాప్టర్ ద్వారా పెండ్లిమర్రికి చేరుకొని తదుపరి ముఖ్యమంత్రి గ్రోమోరు ఎరువుల దుకాణంలో రైతులతో ముఖాముఖి,అనంతరం రచ్చ బండ వద్ద దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ప్రసంగంను వర్చువల్ విధానంలో రైతులతో కలిసి పాల్గొన్న అనంతరం రైతులతో ముఖాముఖిలో పాల్గొనమనున్నారు. ముఖ్యమంత్రి పాల్గొనే ప్రాంతాలల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. భద్రతా, పార్కింగ్ అంశాలలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తుగా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన ప్రాంతాల్లో హెల్త్ క్యాంపులు, హెల్ప్ డెస్క్,అర్జీల స్వీకరణలకు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖాధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించి కట్టు దిట్టమైన భద్రత ఏర్పాట్లు లో భాగంగా పటిష్ఠ బ్యారీకేడింగ్ వ్యవస్థను ఏర్పాటుకు చర్యలు చేపడతామన్నారు. ఈ సమావేశంలో..సి ఎం ఓ భద్రతాధికారి కృష్ణారావు, డ్వామా,డిఆర్‌డిఏ,మెప్మా పీడీ లు ఆదిశేషారెడ్డి, రాజ్యలక్ష్మి, కిరణ్ కుమార్, కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీఓలు జాన్ ఎర్విన్, సాయి శ్రీ, చంద్ర మోహన్,చిన్నయ్య, డిఎంహెచ్ఓ డా.నాగరాజు, జెడ్పీ సీఈఓ ఓబులమ్మ, పోలీసు, ఫైర్, విద్యుత్, ఆర్ అండ్ బి, పీఆర్ వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు బిట్స్ కళాశాలలో జిల్లాస్థాయి యువజనోత్సవాలు

విశాలాంధ్ర-రామాపురం: మండలంలోని బండపల్లి పంచాయతీ పరిధిలోనే భాస్కర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్‌లో స్టెప్పు ఆధ్వర్యంలో మంగళవారం జిల్లాస్థాయి యువజజనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు బిట్స్ యజమాని మన్నూరు భాస్కరు అన్నారు. మండలంలోని బండపల్లి పంచాయతీ బిట్స్ కళాశాలలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ యువజనో త్సవాలు భాగంగా పలు అంశాలలో పోటీలు జరుగుతాయని అన్నారు. ఈ పోటీలకు ఆసక్తిగల యువతీ యువకులు 15- 29మధ్య వయసు కలిగిన వారు పోటీలలో పాల్గొన్న వచ్చునని అన్నారు. కల్చలర్ ట్రాక్ జానపద నృత్యం జానపద గేయం కవిత్వం కథ రచన పెయింటింగ్ డిక్లమేషన్ ఇన్ వేషన్ ట్రంక్ సైన్స్ మేళ్ల అంశాలలో పాల్గొనవచ్చునన్నారు. 2025 లింకులలో వారి కి ప్రవీణ్యం గల వాటిలో వారి పేర్లను నమో దు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఒక్క పోటీలో మాత్రమే పాల్గొనాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ప్రధమ స్థానం సాధించిన వారు రాష్ట్ర స్థాయికి యువజనోత్సవాలలో పాల్గొనచున్నారు. రాష్ట్ర స్థాయిని విజేతలు జాతీయస్థాయి పోటీలలో పాల్గొనవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

జనవరిలో ఇస్తేమా

మొదటి పేజీ తరువాయి

తెలిపారు. జనవరిలో మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని కార్యవర్గ కమిటీ సభ్యులు అధికారులు తమ విధులను బాధ్యతగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన మౌలిక వసతుల కల్పనకు అధికారులు సహకరించాలని కోరారు. ముఖ్యంగా ఇస్తేమా కార్యక్రమానికి సంబంధించి రోడ్ మ్యాపు, త్రాగునీరు, విద్యుత్, మెడికల్, ట్రాఫిక్, బందోబస్తు, ఫైర్ సేఫ్టీ,బ్యారికెట్స్ వంటి తదితర అంశాలపై మంత్రి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ... వచ్చే ఏడాది జనవరి మూడు రోజుల పాటు జరగనున్న రాష్ట్రస్థాయి ఇస్తేమా కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించడానికి పక్క ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే వివిధ శాఖల అధికారులకు మౌలిక వసతులు కల్పనలు, వివిధ రకాల విధులు నిర్వహించడానికి ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు. మా కార్యక్రమానికి సంబంధించి జిల్లాలోని కొప్పర్తి ఏపీఐఐసీ ప్రాంతాన్ని గుర్తించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ఆంధ్ర ప్రదేశ్ తో పాటు తెలంగాణ, దేశవ్యాప్తంగా ముస్లిం మైనార్టీ పెద్దలు హాజరుకానున్నయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అధికారులు కార్యవర్గ సమితీలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు,కడప ఆర్డీవో జాన్ ఐర్విన్, జమ్మలమడుగు ఆర్డీవో సాయి శ్రీ,కడప కమిషనర్ మనోజ్ రెడ్డి,కార్య వర్గ సభ్యులు స్తానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దర్గా ఆశ్రమంలో వనభోజన మహెూత్సవం

విశాలాంధ్ర-రామాపురం: ప్రతి ఒక్కరిలో భక్తి భావం పెంచుకోవాలని రాయచోటి చెందిన ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ భయ్యా రెడ్డి అన్నారు. మండలంలోని నీలకంఠరావుపేట పంచాయతీ శ్రీ సాయి నగర్ లో వెలసిన శ్రీ సమర్థ సద్గురు దర్గా స్వామీజీ. శ్రీ దర్గా మాతాజీ ఆశ్రమమాలో జరుగుతున్న కార్తీక నాలుగవ సోమవారం వారోత్సవాలకు ఆయన హాజరయ్యారు. అనంతరంపూర్వక రుద్రాభిషేకం మహప్నా పురక. రుద్రాభిషేకం. వనభోజనం కార్యక్రమానికి హాజరై ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశ్రమంలో వనభోజన కార్యక్రమం నిర్వహించారు. హసనాపురం పంచాయతీ పరిధిలోని శ్రీ పార్వతీ పరమేశ్వర మహా క్షేత్రం గంగాభవాని సామెత మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో కార్తీక మాసం నాలుగో వారం సోమవారం మాస పురస్కరించుకొని స్వామివారికి రుద్రాభిషేకం. సాయంత్రం 6గంటలకు ఆకాశ దీపం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు తెలిపారు. ఈ ఆలయంలో అన్నదాన కార్యక్రమం అయ్యప్ప పండు స్వామి మరియు శివాలయంలో ఉండే అయ్యప్ప భక్తులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హాజరయ్యారు.

నూతన గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పీలేరు: నూతన గృహప్రవేశం కార్యక్రమంలోపీలేరు ఎమ్మెల్యేనల్లారి కిషోర్ కుమార్ రెడ్డిపాల్గొన్నారు.పీలేరు మండల పార్టీ అధ్యక్షులు వి. శ్రీకాంత్ రెడ్డి నూతన గృహప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆ ప్రాంత ప్రజలతో ముచ్చటించారు. ఎమ్మెల్యే వెంట ఏయంసి చేర్మెన్ పురం రామ్మూర్తి, అమరనాధ రెడ్డి, చిన్న రెడ్డి,వసంతల రాజ, తతితరులు పాల్గొన్నారు.

ENDOWMENTS DEPARTMENT
Sri Eswara & Sri Venugopala Swamy Temple
Thonduru(V&M), Kadapa District
e-Procurement Tender
NIT.No. P/COE/1141/2025 Dt: 03/10/2025

E-Tenders are invited through the e-Procurement portal for **Improvements to Temple**. Interested bidders may visit the official website **www.apeprocurement.gov.in** for detailed information, eligibility criteria, and submission guidelines.

Executive Officer

ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయండి

విశాలాంధ్ర-నిమ్మనపల్లి: భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీన కడపలో జరిగే భవన నిర్మాణ కార్మికులు నిర్వహించబోయే ప్రాంతీయ సదస్సును జయప్రదం చేయాలని అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సలీంబాషా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. భారీగా కార్మికులు కడపకు తరలిరావాలని నిమ్మనపల్లిలో సంబంధించి వాల్ పోస్టర్లు విడుదల చేశారు. మండలం భవన నిర్మాణ కార్మికుల సంఘం నాయకులు చాంద్ బాషా, రామచంద్ర, రాజన్న, నరసింహులు, చిన్న, రెడ్డప్ప, శ్రీనివాసులు, అక్బర్, సలీం తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా పంచాయతీ ట్రాక్టర్

- ఇలాగైతే చెత్త సేకరణ జరిగేది ఎలా

విశాలాంధ్ర-పెద్ద తిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంట, నవాబు కోట ఉమ్మడి పంచాయతీ చెత్త సేకరణ ట్రాక్టర్ నిరుపయోగంగా ఉంది. రెండు పంచాయితీలలో 24గ్రామాలు ఉన్నాయి ఇంటింటికి వెళ్లి ట్రాక్టర్ ద్వారా చెత్త సేకరణ చేసి చెత్తను గ్రామాలలో ఉన్న డంపింగ్ యార్డ్‌కు తరలించాలి. ఈ డంపింగ్ యార్డ్‌లో చెత్త నుండి ఎరువులు సేకరించే విధంగా ప్రభుత్వ విధానాలు ఉన్నాయి. చెత్తను సేకరించాల్సిన ట్రాక్టర్‌ను పంచాయతీ అధికారులు నిరుపయోగంగా ఉంచారు. దీంతో ట్రాక్టర్ వాడుకలో లేకపోవడంతో వాహనం ఎండకు వానకు నానుతూ తుప్పు దశకు చేరుతోంది. చెత్త సేకరణకు ప్రభుత్వ కేటాయించిన ట్రాక్టర్‌ను మరమ్మతుల పేరుతో ప్రక్కన పెట్టడం గ్రామ ప్రజలు పెదవి వివరిస్తున్నారు. ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. గ్రామాలలో ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయరాదని ప్రతి ఒక్కరూ వారి పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారికి అవగాహన కల్పిస్తున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారు. పంచాయతీ సిబ్బంది గ్రీన్ అంబడిసర్‌లు ప్రతిరోజు సైకిల్ రిక్షా ద్వారా ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణ చేస్తున్నారు సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్ లకు చెత్తను తరలిస్తున్నారు. దీంతో కార్మికులకు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాక్టర్ కు మరమ్మతులు చేయించి వాడుకలోకి తీసుకు రావాలని పలువురు కోరుతున్నారు.

ట్రాక్టర్‌కు మరమ్మతులు చేయిస్తాం..
తుమ్మర కుంట గ్రామంలో చెత్త సేకరణ ట్రాక్టర్ నిరుపయోగంగా ఉందని తెలిసింది. త్వరలో ట్రాక్టర్ మరమ్మతులు చేయించి ఉపయోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటాం.
- డిప్యూటీ ఎంపీడీవో ప్రతాపరెడ్డి, పెద్ద తిప్పసముద్రం

న్యూస్ రీల్

సౌదీ రోడ్డు ప్రమాదంపై దిగ్భ్రాంతి

విశాలాంధ్ర-రాయచోటి: సౌదీ అరేబియాలోని పవిత్ర మక్కా నుంచి మదీనాకు వెళుతున్న పవిత్రయాత్రికులు రోడ్డు ప్రమాదంలో 42మంది చనిపోవడం పట్ల అన్నమయ్య జిల్లా వైయస్సార్సీపి మైనార్టీ అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. చనిపోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. అలాగే సౌదీ అరేబియాలో జరిగిన రోడ్డు ప్రమాదంపై రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సౌదీ అరేబియాలో బస్సు, ట్యాంకర్ ఢీకొని ప్రమాదంలో 42మంది ప్రాణాలు కోల్పోవడం విషాదకరం అని తెలిపారు. మక్కా నుంచి మదీనా వెళ్తున్న మార్గంలో జరిగిన ఈ దుర్ఘటనలో హైదరాబాద్‌కు చెందిన వారు మరణించిన విషయం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఘనంగా ధ్వజస్తంభం ప్రతిష్టాపన

విశాలాంధ్ర-గుర్రంకొండ: మండలంలోని తరిగొండ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభం ప్రతిష్టాపన నిర్వహించారు. ఆలయంలో నూతన ధ్వజస్తంభం ప్రతిష్టపన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి ఆలయంలో వేద పండితుల మంత్రోచరణల ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించి ధ్వజస్తంభాన్ని ప్రతిష్టాపన చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు, టిటిడి బోర్డు అధికారులు పాల్గొన్నారు.

మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులుగా యమలా సుదర్శనం

విశాలాంధ్ర-మదనపల్లె: మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ యమాల సుదర్శనం ఎన్నికయ్యారు. పట్టణంలోని సిఎస్ఐ జెసిఎ కమ్యూనిటీ హాల్లో సోమవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా యమలా సుదర్శనం, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గడ్డం నాగముని, ఉపాధ్యాక్షులుగా లింగం సంజీవి, మాధురి, మాధవ్, అశోక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా స్వర్ణ వెంకయ్య, సహాయ కార్యదర్శులుగా కొప్పుల రామచంద్ర, వీరేష్, రామలింగం, ప్రచార కార్యదర్శులుగా మాడ పోతుల రాము, చెరుకూరి గంగులయ్య, శివారిపల్లి సుధాకర్, తుమ్మల ధరణి. రాష్ట్ర అధికార ప్రతినిధిగా పూతలపట్టు ప్రభాకర్, కోశాధికారిగా ఎస్టీడీ హరి, మీడియా ప్రతినిధిగా వడిగల శేఖర్ బాబు, కార్యవర్గ సభ్యులుగా చింతపర్తి శివయ్య, అలగడ్డ ముని, బందర్ రవిశంకర్, బల్లి వెంకయ్య, దాసనంపల్లి శివయ్య, మూర్తి, గుమ్మగట్ట ఈశ్వరయ్య, సూర్య నారాయణ, వెంటస్వామి, చింతపర్తి శ్రీనివాసులు, అంజిబాబు, రమణ, నారాయణ స్వామిలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం మాలల సమస్యలపై అనునిత్యం స్పందిస్తూ, పరిష్కరించే దిశగా తమవంతు కృషి చేస్తామని నూతన కమిటీ ప్రమాణం చేశారు.

మహిళ దారుణ హత్య

విశాలాంధ్ర-మదనపల్లె: మండలంలోని సిటిఎం క్రాస్ రోడ్డులో మహిళ దారుణ హత్యకు గురైంది. ఆగంతకులు గొంతుకు టవల్ బిగించి, ముఖంపై దారుణంగా కొట్టి హత్య చేసినట్లు తెలిసింది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. సీటీఎం క్రాస్ రోడ్డులోని పాకాల వీధికి చెందిన భూమల గడ్డోళ్ల లేట్ అంజనప్ప భార్య సావిత్రమ్మ అలియాస్ బుజ్జమ్మ (48) వీధినాటకాలు వేసుకుంటూ జీవనం చేసేది. ఈమెకు కుమారుడు ఆదిత్య, కుమార్తె కవిత ఉన్నారు. ఆదివారం రాత్రి 9.30 లకు బహిర్భూమికని ఇంటి వెనుకవైపు ఉన్న చెట్లలోకి వెళ్లిన తిరిగి రాలేదు. ఉదయం శవమై కనిపించిందని కుటుంబీకులు తెలిపారు. సావిత్రమ్మను ఎవరు హత్య చేశారు. ఎందుకు చేశారన్నది తెలియరాలేదు. ఈ మేరకు మదనపల్లె తాలూకా పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమారుడిపైనే అనుమానాలు

సావిత్రమ్మను కుమారుడే హత్య చేసి ఉంటాడని స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మద్యానికి అలవాటు పడిన సావిత్రమ్మ కుమారుడు ఆదిత్య మేస్త్రీ పని చేయడం తో డ్రైవర్‌గా వెళ్లేవాడు. ఇటీవల పనులకు వెళ్లకుండా జులాయిగా తిరుగుతున్నాడు. అంతేకాకుండా తన వద్ద ఉన్న పాత బైక్‌ను ఇచ్చేసి రెండురోజుల క్రితం షోరూమ్ బైక్‌ను కొనుగోలు చేశాడు. దీంతో తల్లి సావిత్రమ్మ, మేనమామ హవుమంతప్పలు మందలించారు. షోరూమ్ బైక్‌ను తిరిగి వెనక్కి ఇచ్చేసారు. దీం తో ఆదిత్య అమ్మపై కక్ష్య పెంచుకు న్నాడు. రాత్రి ఇంటి సమీపంలో స్నేహితుల తో కలిసి మద్యం తాగుతుండగా అదే సమ యంలో సావిత్రమ్మ బహిర్భూమి కోసం అ టుగా వెళ్లడాన్ని గమనించి మద్యం మత్తులో తల్లిని హత్య చేసి ఉంటాడని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తల్లి హత్యకు గురై మృ త్యువాత పడగా ఆదిత్య ఇంటివద్ద లేకుండా పరారయ్యాడు. దీనికితోడు అతని సెల్ ఫోన్ స్విచాఫ్ చేసుకున్నాడు. దీంతో అతనిపై ఇం కా అనుమానాలు బలపడుతున్నాయి. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

శివనామస్మరణతో మార్మోగిన శివాలయం

విశాలాంధ్ర-పెద్దతిప్పసముద్రం: స్థానిక విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శివనామస్మరణతో మార్మోగింది. కార్తీక మాసం నాలుగవ సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఉదయం నుండి రాత్రి వరకు భక్తులతో కిటకిటలాడింది. సేవకుడు సనగరం పట్టాభి రామయ్య పర్యవేక్షణలో కార్తీకమాస ఉత్సవ పూజలు వేద పండితులుఘనంగా నిర్వహించారు. శివలింగమునకు ఏకవార రుద్రాభిషేకం, రుద్ర హెూమం, పూర్ణాహుతి పలు పూజా కార్యక్రమాలు జరిగాయి. వేద పండితులు మంత్రోత్సవాల మధ్య శివలింగమునకు ప్రత్యేక పూల అలంకరణ, సప్త హారతి సాయంత్రం మహిళా భక్తులు అధిక సంఖ్యలో వచ్చి దీపాలు వెలిగించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అన్నదాన వితరణ నిర్వాహకులు కల్పించారు.

సౌదీలో 45మంది భారతీయులు మృతి

- కాంగ్రెస్ పార్టీ నేతల సంతాపం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: సౌదీ అరేబియా దేశంలోని మక్కా, మదీనా పవిత్ర యాత్ర సందర్భంగా అక్కడ జరిగిన బస్సు దగ్ధం ప్రమాద సంఘటనలో 45మంది భారతీయులు మృతి చెందడం పట్ల కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు మయాన రహమతుల్లా ఖాన్ సంతాపం తెలిపారు. కడపలో సోమవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పవిత్రమైన ఉమ్రా పర్యటనకు వెళ్లిన వారు మక్కా పవిత్ర సందర్శన అనంతరం అక్కడినుండి మదీనాకు వెళుతున్న మార్గమధ్యంలో ఆయిల్ ట్యాంకర్ ను బస్సు ఢీకొన్న ప్రమాదంలో వారందరూ కాలిపోయి చనిపోవడం బాధాకర మన్నారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కోరారు.

నీటి సమస్య పరిష్కరించండి

- సబ్ కలెక్టర్‌కు గ్రామస్తులు వినతి

విశాలాంధ్ర-మదనపల్లె: తాగేందుకు గుక్కెడు నీళ్లులేక నరకయాతన అనుభవిస్తున్నాం. గ్రామంలో నెలకొన్న తాగినీటి సమస్యను పరిష్కరించి ఆదుకోవాలంటూ సోమవారం మదనపల్లి మండలం, మాలేపాడు పంచాయతీ, కత్తివారిపల్లి గ్రామస్తులు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం గ్రామ అధ్యక్షులు నాగరత్నమ్మ, కార్యదర్శి నాగరాజులు మాట్లాడుతూ కత్తివారిపల్లి గ్రామంలో సుమారు 85కుటుంబాలు నివాసాలు ఉన్నాయన్నారు. గ్రామంలో ఉన్న మంచినీటి బోరు ఆరునెలల క్రిందట చెడిపోవడంతో ఇబ్బందులు తలెత్తాయన్నారు. అప్పటి నుంచి నీటికోసం నానా తంటాలు పడుతున్నామని, నాయకులకు మొరపెట్టుకున్నా, అధికారులను ఆశ్రయించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. దీంతో రైతుల బోర్లు వద్దకు వెళ్లి తాగునీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. వెంటనే బోరును వేసి, ప్రతి వీధికి కుళాయిల ద్వారా వీటి సరఫరా చేయాలని కోరారు. అనంతరం సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఆదినారాయణ, శ్రీనివాసులు, రేణుక గ్రామస్థులు పాల్గొన్నారు.

కిడ్నీ రాకెట్ ఉదంతంపై సిట్ ఏర్పాటు చేయాలి: సిపిఐ

విశాలాంధ్ర-మదనపల్లె: మదనపల్లిలో బయట పడ్డ కిడ్నీ రాకెట్ ఉద్దాంతం దేశవ్యాప్తంగా విస్తరించి ఉంటాదని వీటిపైన సిబిసిఐడి సిట్ ఏర్పాటు చేయాలని నేడు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ బృందం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చి మెడికల్ మాఫియా వీధి వీధికి పుట్టగొడుగుల్లాగా పుట్టకొస్తున్న ప్రైవేట్ హాస్పటల్ దందాపై వైద్యఆరోగ్యశాఖ దర్యాప్తు చేయాలని కోరడం జరిగిందని సిపిఐ అన్నమయ్య జిల్లా సహాయ కార్యదర్శి తోపు కృష్ణప్ప, సిపిఐ మదనపల్లి నియోజకవర్గ కార్యదర్శి మురళీలు మాట్లాడుతూ ఈ వ్యవహారంపై ప్రభుత్వం చొరవ తీసుకొని పూర్తి స్థాయి విచారణకు సిట్ ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నాయకులు గంగాధర్, హరి, నర్సింహులు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా ఎల్ఐసి మొబైల్ వాహనాల ప్రచారం

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: దాదాపు 6లక్షల పాలసీలు ఒకరోజు సేకరించి 2025 జనవరి 20న ఒక్కరోజులో అత్యధిక పాలసీలు సేకరించిన బీమా సంస్థగా ఎల్ఐసి గిన్నిస్ రికార్డు సాధించిందనీ, అదే స్ఫూర్తితో ఈ ఆర్థిక సంవత్సరం మొత్తం పనిచేస్తున్నామని ఎల్ఐసి కడప సీనియర్ డివిజనల్ మేనేజర్ జి. కె.ఆర్.వి. రవికుమార్ అన్నారు. స్థానిక ఎల్ఐసి కార్యాలయ సమీపంలో మొబైల్ వెహికల్ ప్రచారాన్ని జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. కడప డివిజన్ పరిధిలోని కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల్లో 10 మొబైల్ వాహనాలను రంగంలోకి దించుతున్నామని అన్నారు. నవంబర్ 17 నుండి 27 దాకా అంటే 11 రోజులపాటు 10 వాహనాలు, నికరంగా 110 రోజులు అన్నట్టు, ఎల్ఐసి అందిస్తున్న పథకాలను ప్రచారం చేస్తామని అన్నారు. కడప డివిజన్ గత ఆర్థిక సంవత్సరంలో జోన్ లోను, జాతీయ స్థాయిలోనూ మంచి వ్యాపారం చేసి గుర్తింపు పొందిందని, ఈ ఏడాది కూడా ఎల్ఐసి సాధించబోయే వ్యాపార విజయాల్లో కడప డివిజన్ పాత్ర గణనీయంగా ఉంటుందని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. ఈ మొబైల్ వాహనాల ప్రచార ప్రారంభ కార్యక్రమంలో సేల్స్ మేనేజర్ రామకృష్ణ, ఇతర మేనేజర్లు సత్య ప్రసాద్, సాల్మన్ రాజు, మురళీధర్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, లక్ష్మీనారాయణ, వెంకటకృష్ణ, ఆర్కాట్ శ్రీనివాస్, ప్రసాద్, రాకేష్, అవధానం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

మహిళా భద్రతపై అవగాహన

విశాలాంధ్ర-ముద్దనూరు: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమం సిఐ దస్తగిరి,మహిళ పోలీసులు నిర్వహించారు. విద్యార్థులు గ్రామ ప్రజల్లో మహిళా హక్కులు, వ్యక్తిగత భద్రతపై చైతన్యం కల్పించడమే ఈ కార్యక్రమం ఉద్దేశ్యంగా పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళలపై వేధింపులు, మహిళా భద్రతా చర్యలు,అలాగే "గుడ్ టచ్, బ్యాడ్ టచ్"అంశాలపై విద్యార్థులకు వివరించారు. మహిళా రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందని, విద్యార్థులకు పోలీసులు వివరించారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటో కారు ఢీ రైతు మృతి

విశాలాంధ్ర-రామాపురం: కర్నూలు చిత్తూరు 40వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం, బండపల్లి బస్ స్టాప్ సమీపంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోను కారు ఢీకొని కోటకొండ పెద్దిరెడ్డి(57) అనే రైతు మృతి చెందినట్లు ఎస్సై వెంకట సుధాకర్ రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి రామాపురం మండలం చిట్లూరు పంచాయతీ పాలనగారి పల్లెకు చెందిన రైతు కోటకొండ పెద్దిరెడ్డి ఇంకా కొంతమంది రైతులు రాయచోటి మార్కెట్ కు కూరగాయలను ఆటోలో తీసుకు వెళ్తుండగా మార్గమధ్యలోకి బండపల్లి బస్టాప్ సమీపానికి వెళ్ళగానే వెనుక వైపున శ్రీశైలం నుంచి రాయచోటి వైపు వెళ్తున్న కారు ఆటోను ఢీకొంది. ఈ సంఘటనలో ఆటో బోల్తా పడింది. ఈ సంఘటనలో కోటకొండ పెద్దిరెడ్డి గాయాలయ్యాయి గాయపడిన వ్యక్తిని చికిత్స నిమిత్తం ఢీకొన్న కార్లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోకి వెళ్ళగానే మృతి చెందాడు. మృతునికి భార్య కుమారుడు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతిని శవ పరీక్ష నిమిత్తం బంధువులకు అప్పగించి ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట దర్యాప్తుసుధాకర్ రెడ్డి తెలిపారు.

మౌలిక వసతులు

కల్పించాలంటూ నిరసన

విశాలాంధ్ర-గాలివీడు: అరవీడు గ్రామ పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో తక్షణమే మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ, బాధితులతో కలిసి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం వద్ద బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సమస్యలపై వినతిపత్రాన్ని ఎంపీడీవోకు సమర్పించారు. సంఘం జిల్లా నాయకుడు మండెం సుధీర్‌కుమార్ మాట్లాడుతూ, 2021లో అప్పటి వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం సుమారు 100 కుటుంబాలకు ఇంటి స్థలాలు, ఇండ్లు మంజూరు చేసినప్పటికీ కాలనీలో ఇప్పటివరకు మంచినీరు, వీధిలైట్లు, సిమెంటు రోడ్లు వంటి మౌలిక వసతులు అందలేదని విమర్శించారు. సమస్యలపై స్పందించిన ఎంపీడీవో చంద్రమౌళి సమస్యల పరిష్కారం కోసం తన వంతు ప్రయత్నం తప్పక చేస్తానని హామీఇచ్చారు. నాయకులు వీరభద్ర, వెంకటరమణ, ఇస్మాయిల్, జమ్ముడ్, ప్రసాద్, కాలనీ వాసులు మహబూబ్ బాషా, ఇస్మాయిల్, వెంకటేశు, విజయ్, షాహిదా బేగం, వెంకటరమణ, అమీనాబీ, ఖాదర్‌వలీ పాల్గొన్నారు.

కృష్ణానగర్‌లో ఆక్రమణలు తొలగిస్తాం

- సబ్ కలెక్టర్ భావన

విశాలాంధ్ర-రాజంపేట: రాజంపేట మండలం కూచివారిపల్లె పంచాయతీ కృష్ణానగర్ సర్వేనెంబర్ 640లో ప్రజలు వినియోగిస్తున్న రహదారిని అలాగే కొనసాగించాలని, రహదారి లేకుండా నిర్మించిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇచ్చింది. కృష్ణ నగర్ లో నివాసం ఉంటున్న ప్రజలు హైకోర్టులో దాఖలు చేసిన రిట్ పిటిషన్ 27214/2025 మేరకు గత నెల అక్టోబర్ 19న తీర్పు ఇచ్చింది. ఈ మేరకు హైకోర్టు తీర్పు అమలు చేస్తామని రాజంపేట సబ్ కలెక్టర్ భావన కృష్ణానగర్ వాసులకు భరోసా ఇచ్చారు. సోమవారం ప్రజా పరిష్కార వేదికలో కృష్ణానగర్ వాసులు సబ్ కలెక్టర్ ను కలిసి హైకోర్టు తీర్పును అందజేశారు. వెంటనే స్పందించిన సబ్ కలెక్టర్ కూచివారిపల్లె గ్రామపంచాయతీ, రాజంపేట తాసిల్దార్, డివిజన్ సర్వే ఇన్స్పెక్టర్, రాజంపేట సర్వేయర్లకు నిబంధనల మేరకు,రహదారిని చూపి ఆక్రమణలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్టోబర్ 13, 14తేదీలలో రాజంపేట అర్బన్ ఇన్స్పెక్టర్ హైకోర్టులో కేసు నడుస్తుందని తెలియజేసినా పట్టించుకోకుండా కనీసం కేసు నెంబర్ పరిశీలించకుండా దగ్గర ఉండి అక్కడే కూర్చొని అక్రమ నిర్మాణాలను కట్టించారని సబ్ కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. సబ్ కలెక్టర్ ను కలిసిన తర్వాత రాజంపేట పంచాయతీ కార్యదర్శి కమలా దేవిని కూడా కలిసి హైకోర్టు తీర్పును అందజేశారు. రెవిన్యూ అధికారులతో మాట్లాడి ఆక్రమణలు తొలగిస్తామని హైకోర్టు తీర్పును అమలు చేస్తామని పంచాయతీ కార్యదర్శి కృష్ణానగర్ ప్రజలకు హామీ ఇచ్చారు.

శాంతిభద్రతలు కాపాడుతా: సిఐ

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: చట్టానికి కట్టుబడి శాంతిభద్రతలు కాపాడుతానని నూతన సిఐ చంద్రశేఖర్ పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా డిసిఆర్బి నుంచి బదిలీపై వచ్చి సోమవారం రైల్వేకోడూరు అర్బన్ సిఐగా బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలో అసాంఘిక కార్యకలాపాలను అదుపులోకి తీసుకొస్తామన్నారు. నిజాయితీగా, నిష్పక్షపాతంగా పని చేస్తామన్నారు. పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. స్థానిక పోలీసు సిబ్బంది నూతన సిఐతో పరిచయం చేసుకున్నారు.

సొంతింటి కల నిజం చేసిన ప్రభుత్వం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-మైదుకూరు: ఇల్లులేని నిరుపేదలకు సొంతింటి కల నెరవేర్చాలని ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి అర్బన్ ప్రతి లబ్ధిదారునికి రూ.2,50,000 అమౌంట్ మంజూరు చేయడం జరిగింది.ఇందులో భాగంగా మొదటి విడతలో మైదుకూరు మున్సిపాలిటీ నందు దాదాపు 222 మంది ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్లను మంజూరు చేయడం జరిగింది. ఇవాళ శెట్టివారిపల్లె గ్రామం నందు 41మంది నిరుపేదలకు ఇళ్లను మంజూరు చేయించి, ధ్రువీకరణ పత్రాలను అందజేయటం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా నల్లిపోగు లక్ష్మీదేవి అనే లబ్ధిదారుని ఇంటి నిర్మాణానికి భూమి పూజ చేయటం జరిగింది.

ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో అర్హులైన ప్రతి పేద వాడికి సొంతిల్లు నిర్మిస్తామని హామీ ఇవ్వటం జరిగింది.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ రాజా రత్నం, ఎంఆర్ఓ రాజ సింహ నరేంద్ర, మునిసిపల్ కమీషనర్ రంగ స్వామి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

చదరంగం పోటీలు

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కడప నగరములోని జిల్లా కేంద్ర గ్రంథాలయములో విద్యార్థులకు పలు అంశాలపై వారం రోజులపాటు పోటీలు నిర్వహించుచున్నారు. ఇందులో భాగముగా సోమవారం జిల్లా కేంద్ర గ్రంధాలయము నందు జిల్లా గ్రంథలయ సంస్థ కార్యదర్శి ఎలిశెట్టి పవన్ కుమార్ చదరంగం పోటీలు ప్రారంభించారు. పవన్ కుమార్ మాట్లాడుతూ చదరంగం మేధో క్రీడల్లో ముందు వరసలో ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ అనిస్ దర్బారి చీఫ్ ఆర్బిటర్, శ్రీకాంత్, ఆర్బిటర్ సభిహా వ్యవహరించారు. సీనియర్ అసిస్టెంట్ రాజకుమార్, గ్రంథాలయాధికారులు రాజకుమారి, సురేష్, నవాబ్‌జాన్, జేమ్స్, సుబ్బమ్మ, రామప్రతాప్, శేఖర్, వెంకటరమణ, గౌస్, ఇబ్రాం సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధిపై ఇంటింటి సర్వే

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని రామ్ నగర్ నందు ఎల్‌సిడిసి (లేప్రోసి కేస్ డిటెక్షన్ కాంపెయిన్) కృష్ఠ వ్యాధి గ్రస్తులను గుర్తించే కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేశారు. ఈ సర్వేను డిపిఎంఓ శివశంకరయ్య పర్యవేక్షించి శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, చేతులు, పాదాలు, నరాలు తిమ్మిర్లు, కళ్ళు పూర్తిగా మూసుకోలేక పోవడం వంటి లక్షణాలు ఉన్నాయని అడుగుతూ అనుమానితులను గుర్తించి రెఫర్ చేయడం జరుగుతుంది అన్నారు. అలాగే ఎల్‌సిడిసి సోమవారం నుండి 30వ తేది వరకు ఇంటింటా సర్వే పట్టణం అంతా జరుగుతుందని అన్నారు. ఈ సర్వేలో వ్యాధి లక్షణాలు కల వారిని గుర్తించి నమోదు చేసుకొని ఉచితంగా ప్రభుత్వం ఎండిటి మందులు ఇస్తుందని తెలిపారు. సర్వేలో ఆశాలకు తగు సూచనలు ఇచ్చారు. అనంతరం పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. డిహెచ్ఈఓ శోభారాణి, సిఓఎంఓ సుబ్బారెడ్డి, హెల్త్ సెక్రటరీ ఉదయ లక్ష్మి, ఆశాలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు జిరాఫీ చెస్ పోటీలు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ప్రొద్దుటూరు శాఖా గ్రంథాలయం నందు సోమవారం నాడు విద్యార్థులకు జిరాఫీ చెస్ పోటీలను నిర్వహించారు. అతిథులుగా రిటైర్డ్ టీచర్ డా. మునిశేఖర్ రెడ్డి, జెవివి కన్వీనర్, చంద్రశేఖర రావులు పాల్గొన్నారు. చాడ మునిశేఖర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఇతర కళలు కూడా అభివృద్ధి చేసుకోవాలని సాధనలో పనులు సమకూర ధరలేన అనుసామెతలు మీరు ఉపయోగించుకొని మీ యొక్క కలలను సహకారం చేసుకోవాలని తెలిపారు. అలాగే జెవివి కన్వీనర్ చంద్రశేఖర రావు మాట్లాడుతూ విద్యార్థులకు కేవలము నాలుగు పదాలతో జీవితంలో ఎలా ఉండాలనేది వివరించారు. జీవితంలో అనేకమైన ఒడుదుడుకులు అలలలా వస్తుంటాయని, వాటన్నింటిని తట్టుకొని తీగల లాగా మనం అల్లుకుంటూ చివరకు సాధనం చేస్తూ నీకున్న కలలను సాకారం చేసుకోవాలని తెలిపారు. నాగార్జున, అరవింద్, 30మంది పాఠశాల విద్యార్థులు, పేరెంట్స్ పాల్గొన్నారు.

ఆర్ఎస్ బస్సును పునరుద్ధరించండి

విశాలాంధ్ర-నందలూరు: నందలూరు రైల్వే స్టేషన్ నుంచి రాజంపేట రైల్వే స్టేషన్ వైపు విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపార వేత్తలు, సాధారణ ప్రజలు రోజూ ప్రయాణించే ఆర్టీసీ బస్ సర్వీసులను పునరుద్ధరించాలని కోరుతూ స్థానికులు రాజంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ మాధవి లతకి సోమవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గతంలో నందలూరు-రాజంపేట మధ్య నడిచిన ఆర్టీసీ బస్సు సర్వీసులు నిలిపివేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు కళాశాలలకు వెళ్లడానికి, ఉద్యోగులు విధులకు చేరుకోవడానికి, వృద్ధులు, మహిళలు అత్యవసర సేవల కోసం ప్రయాణించే సందర్భాల్లో ప్రత్యామ్నాయ వాహనాలు లేక ఇబ్బందులు పడుతున్నట్లు వినతి పత్రంలో వివరించారు. వినతి పత్రాన్ని స్వీకరించిన డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించి సమస్యపై వీలైనంత త్వరగా బస్సు సర్వీసులను పునఃప్రారంభం చేసే దిశగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు. రాచూరి మురళి, వీరబల్లి జయ కుమార్ రెడ్డి, పఠాన్ మెహర్ ఖాన్, హ్యూమన్ రైట్స్ ఉమ్మడి జిల్లా చైర్మన్ డాక్టర్ డేవిడ్ కళ్యాణ్ రాజ్, కిరణ్ పాల్గొన్నారు.

విజ్ఞాన సంస్కృతికి నిలయం గ్రంథాలయం: రవిశంకర్ రాజు

విశాలాంధ్ర-రాజంపేట: విజ్ఞాన సంస్కృతికి నిలయం గ్రంథాలయాలు అని గ్రంథాలయ అధికారి రవిశంకర్ రాజు అన్నారు. 58 వ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణ కేంద్రంలోని ఆర్ అండ్ బి బంగ్లా వద్ద ఉన్నటువంటి గ్రంథాలయాన్ని రాజంపేట కేంద్రంగా పనిచేస్తున్న పాత్రికేయులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటర్నెట్, సోషల్ మీడియా వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ గ్రంథాలయాల ప్రాముఖ్యత ఏమాత్రం తగ్గలేదన్నారు. పుస్తకాలు ఇస్తున్న లోతైన జ్ఞానం, విశ్లేషణ శక్తి, ఆలోచనా సంపత్తి అమూల్యమన్నారు. ప్రతి సంవత్సరం నవంబర్ 14 నుండి వారం రోజులు పాటు జరిగే గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానంగా పుస్తక ప్రదర్శన, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులను ప్రధానం చెయ్యడం జరుగుతుందన్నారు. జ్ఞానం మనిషిని సంపూర్ణుడిగా మార్చే శక్తి.. అజ్ఞానానికి నిలయమే గ్రంథాలయం అన్నారు. ఈ వారోత్సవాల ద్వారా మరింత సమాచారం ప్రజల్లోకి చేరుతుందన్నారు.గ్రంథాలయాలు విద్య, జ్ఞానం, ప్రజల్లో చైతన్యం పెంచడంలో కీలక పాత్ర పోషించాయి అన్నారు.అనంతరం రాజంపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు బచ్చోటి భాస్కర్ మాట్లాడుతూ పుస్తకాలు మనలో ఉన్న అనేక సందేహాలను తీర్చడమే కాక మనలో ఆలోచనా శక్తిని పెంపొందిస్తాయన్నారు. సీనియర్ పాత్రికేయులు అలీ షేర్, రాయలు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద కార్మికులందరికీ సమాన వేతనాలు ఇవ్వాలి

- జెన్ కో ఎండికి వినతి బిపాన్న శివయ్య ఏఐటియుసి రాష్ట్ర కార్యదర్శి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పత్తి సంస్థలో 167 జీఓను పూర్తిగా రద్దు చేసి ఒప్పంద, పొరుగు సేవల కార్మికులందరికీ ఒకే రకమైన వేతనాలు చెల్లించాలని ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొన్న శివయ్య కోరారు. సోమవారం విజయవాడలోని విద్యుత్ సౌధలో కార్యనిర్వాహక సంచాలకులు (ఎమ్.డి) నాగలక్ష్మిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ఉత్పత్తి సంస్థలలో పనిచేస్తున్న ఒప్పంద కార్మికులలో వ్యత్యాసాలు ఉన్నాయని ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 167 ప్రకారం కొంత మందికి వేతనాలు చెల్లిస్తున్నారన్నారు అయితే ప్రస్తుత జీవన వ్యయం రోజు రోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువులతో పాటు అన్ని రకాల వస్తువుల ధరలు విపరీతంగా ఉన్నాయన్నారు. చాలీచాలని జీతాలతో బతుకు భారంగా మారుతున్నది. కావున ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 167ను పూర్తిగా రద్దు చేసి ఎటువంటి షరతులు లేకుండా ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 129 ప్రకారం ఒప్పంద కార్మికులందరికీ ఒకే రకమైన వేతనాలు చెల్లించాలని కోరారు. ఎండి నాగలక్ష్మి అనుకూలంగా స్పందించి త్వరలో ఒకే రకమైన వేతనాలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎనర్జీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్, జెన్ కో కాంట్రాక్టు కార్మికుల నాయకులు విగంగా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

హెూటల్‌ను ప్రారంభించిన మహేశ్వర్ రెడ్డి

విశాలాంధ్ర-చిట్వేలు: మండల కేంద్రంలో సోమవారం, వినాయక హెూటల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా చిట్వేలి ఉపసర్పంచ్ చౌడవరం ఉమామహేశ్వర్ రెడ్డి, రమణారెడ్డి, పలువురు పాల్గొని హెూటల్‌ను ప్రారంభించారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి హెూటల్ బయట ప్రధాన రహదారిపై అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. తిరుపతికి చెందిన జాలేరాయల్, కుటుంబ సభ్యులు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని హెూటల్ యజమాని గిరి, కుటుంబ సభ్యులతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

టిడిపి నగర నూతన కమిటీల ప్రమాణ స్వీకారం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: తెలుగుదేశం పార్టీ నగర నూతన కమిటీల ప్రమాణ స్వీకారం సోమవారం కడప ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, పార్టీ పరిశీలకులు ఎమ్మెల్సీ బి.టి. నాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు పార్టీ ఆశయాలకు అనుగుణంగా, క్రమశిక్షణ, ప్రజా నిబద్ధతలను పాటిస్తూ ప్రజలతో నేరుగా అనుసంధానమై పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో గుర్తించి, ప్రభుత్వం, పార్టీ అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి వేగంగా, పారదర్శకంగా చేరేలా సమిష్టిగా పనిచేయాలని స్పష్టం చేశారు. నగర టిడిపి బలోపేతం, ప్రజా చేరిక విస్తరణ, అభివృద్ధి కార్యక్రమాల అమలులో నూతన కమిటీల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా, నిజాయితీతో, సేవా భావంతో, బలమైన టీమ్‌వర్క్‌తో ముందుకు సాగాలని నేతలు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు లయన్ మన్సూర్ అలీఖాన్, ఉపాధ్యక్షులు ప్రముఖ న్యాయవాది పసుపులేటి గౌతమ్ కుమార్,మహిళా అధ్యక్షురాలు పార్వతి,రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి గోవర్ధన్ రెడ్డి, కడప మార్కెట్ యాడ్ చైర్మన్ ఉస్మాన్, వైస్ చైర్మన్ సుబ్బా రెడ్డి, రాష్ట్ర వడ్డెర డైరెక్టర్ గండికోట వెంకట సుబ్బయ్య, రాష్ట్ర వెర్ హౌస్ డైరెక్టర్ మురికినాటి శ్రీధర్, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ డైరెక్టర్ లోమడ చంద్ర మోహన్ రెడ్డి, అధికార ప్రతినిధి డాక్టర్ జిలాని బాషా, రిమ్స్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు,వల్లి, వెంకటసుబ్బయ్య, యాటగిరి రాంప్రసాద్, పాలకొండ రాయస్వామి టెంపుల్ చైర్మన్ రెడ్డయ్య, నగర ప్రధాన కార్యదర్శి ముక్కర సుబ్బారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ బోనం శిలాస్, నగర కమిటీ కార్యదర్శులు డివిజన్, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

అభివృద్ధికి భాగస్వాములౌతున్న పారిశ్రామిక దిగ్గజాలు

- రాష్ట్ర అధ్యక్షులు పంతగాని నరసింహప్రసాద్

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: రాష్ట్ర అభివృద్ధికి పారిశ్రామిక దిగ్గజాలు భాగస్వాములౌతున్నారని తెలుగుదేశంపార్టీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు పంతగాని నరసింహప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం కోడూరు టౌన్ సూర్యనగర్‌లోని తన కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ అహర్నిశలు శ్రమించి అంతర్జాతీయంగా వివిధ దేశాలకు వెళ్లి భారీ పరిశ్రమలను తీసుకొస్తున్నారని కొనియాడారు. ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు ఉన్న అపారమైన అవకాశాలను వివరించిన తీరు పారిశ్రామికవేత్తలను ఆకట్టుకుందన్నారు. అబివృద్ధిపై వైసిపి మాట్లాడే హక్కు లేదన్నారు. పేదలు జీవనం కోసం కువైట్ వెళ్లాలి లేదా, కూలికి వెళ్లే దుస్థితి నెలకొందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని నరసింహప్రసాద్ పేర్కొన్నారు.

విజయభాస్కర్ రెడ్డిని సత్కరించిన నాయకులు

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: ప్రముఖ వైద్యులు మల్టీ స్పెషాలిటీ సన్రైజ్ హాస్పిటల్ అధినేత అంకిరెడ్డి పల్లె విజయభాస్కర్ రెడ్డిను వైస్సార్సీపీ రాష్ట్ర డాక్టర్స్ వింగ్ జనరల్ సెక్రటరీగా నియమితులు అయినందున వైస్సార్టీయుసి నగర అధ్యక్షులు నాగరాజు వైస్సార్ జిల్లా డాక్టర్స్ వింగ్ అధ్యక్షులు నాగార్జున రెడ్డి వైస్సార్సీపీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షులు కంచుపాటి బాబుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. నాయకులు మాట్లాడుతూ వైసిపి పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి పార్టీ కొరకు కష్టపడిన ఏ కార్యకర్తను మరిచిపోడని వారి కష్టాన్ని గుర్తించి తగ్గిన గుర్తింపు ఇస్తున్నారని వారు తెలిపారు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజా వ్యతిరేక విధానాలు వెళ్ళువెతుతున్నాయని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్య పరుస్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు యనమల రవి వైస్సార్టీయుసి నాయకులు పాల్గొన్నారు.

పంట నమోదు జాబితా సామాజిక తనిఖీ

విశాలాంధ్ర-లింగాల: ఖరీఫ్ 2025 ఈ పంట నమోదు జాబితాల సామాజిక తనిఖీ, గ్రామ సభలను లింగాల మండలంలోని రైతు సేవ కేంద్రాల్లో సోమవారం నిర్వహించారు. లింగాల, బోనాల, వెలిదండ్ల రైతు సేవ కేంద్రాల్లో జరిగిన ఈ కార్యక్రమాల్లో మండల వ్యవసాయ అధికారి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని అన్ని రైతు సేవ కేంద్రాల పరిధిలో ఖరీఫ్ 2025 పంట నమోదు పూర్తైందని తెలిపారు. అర్హుల ప్రాథమిక జాబితాను సామాజిక తనిఖీ కోసం ప్రతి రైతు సేవ కేంద్రంలో ప్రదర్శిస్తున్నామని చెప్పారు. జాబితాలపై రైతుల అభ్యంతరాలు స్వీకరించేందుకు గ్రామ సభలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. పంట నమోదు చేసుకున్న ప్రతి రైతు పేరు, సర్వే నంబర్, విస్తీర్ణం, పంట సాగు విధానం వంటి వివరాల్లో ఎక్కడైనా పొరపాట్లు ఉంటే వెంటనే వ్రాతపూర్వకంగా తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు రాణి, రామసుందర్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి తో పాటు సంబంధిత గ్రామాల రైతులు పాల్గొన్నారు.

సామాజిక సేవలో వాలంటీర్లు ఆదర్శంగా నిలవాలి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: సామాజిక సేవలో పెండ్లిమర్రి డిగ్రీ కళాశాలను వాలంటీర్లు ఆదర్శంగా నిలపాలని యోగివేమన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.ఎన్ వెంకటరామిరెడ్డి అన్నారు. పెండ్లిమర్రి ఆదర్శ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు ముగింపు కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా యోగివేమన యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.ఎన్ వెంకటరామిరెడ్డి విద్యార్థుల సేవా గుణాన్ని ప్రశంసించారు. విశిష్ట అతిథి డాక్టర్ రాజగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సేవ గుణము అలవర్చుకోవాలన్నారు.కళాశాల ప్రిన్సిపల్ ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏడు రోజులగా ఎన్ఎస్ఎస్ సేవా శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించడంలో విద్యార్థులు కీలకపాత్ర వహించారన్నారు. దత్తత గ్రామంలో పరిశుభ్రత, అక్షరాస్యత - ఆవశ్యకత, ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించిన అంశాలను గురించి వాలంటీర్లు స్థానిక ప్రజలకు చక్కటి అవగాహన కల్పించడంలో కృతకృత్యులయ్యారని తెలిపారు. ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఈ. నిఖిల ప్రియ మాట్లాడుతూ విద్యార్థులు చైతన్య ర్యాలీ కార్యక్రమాలను , అవగాహన సదస్సులను నిర్వహించి గ్రామీణులకు సామాజిక స్పృహ కల్పించారని తెలిపారు. ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు నిర్వహణలో చొరవను, ఉత్సాహాన్ని చూపిన వాలంటీర్లకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బెస్ట్ ఎన్ఎస్ఎస్ వాలంటీర్ అవార్డులను అందజేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ చెంద్రాయుడు, అధ్యాపకులు వరలక్ష్మి, రామకృష్ణ, డా.రమ్య జ్యోతి, ప్రసన్న కుమార్, శాలిని, మురళీమోహన్, వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహర్షి హైస్కూల్‌లో అవేర్నెస్ ప్రోగ్రాం

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్: శ్రీ మహర్షి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ నందు విద్యార్థునులకు అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది. చదువుతోపాటుగా విద్యార్థులకు ప్రెజెంట్ జనరేషన్ మహిళల పట్ల జరుగుతున్న ఆగడాలను విద్యార్థినిలు బయట సమాజంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, చదువు పట్ల ఆసక్తి ఏవధంగా కనపరచాలి. నేటి సమాజంలో స్త్రీల పట్ల గుడ్ టచ్ బ్యాడ్ టచ్ వంటి వాటిపై విద్యార్థునీకు కొన్ని మేలుకోవలు కొన్ని జాగ్రత్తలు తెలియజేయడం జరిగింది. ఈ ప్రోగ్రాంలో మహర్షి ఇంగ్లీష్ మీడియం స్కూల్ యాజమాన్యం మోహన్ సార్, భాస్కర్ హెచ్‌మ్ బాల ఓబయ్య సహకారాలతో ఈ ప్రోగ్రాంను నిర్వహించడం జరిగింది ఈ ప్రోగ్రాంలో స్కూల్ మహిళ టీచర్స్ ప్రశాంతి, సాయి, శైలజ ప్రభావతి, షబానా, చాందిని, సుధా, రమాదేవి, శిరీష ,శ్వేత, జెసిల, రాగిష, విద్యార్థునులు అందరూ కలిసి ప్రోగ్రాం విజయవంతం చేయడం జరిగింది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టెట్‌పై స్పందించాలి

విశాలాంధ్ర- పోరుమామిళ్ల రూరల్: ఉపాధ్యాయులందరికీ టెట్ తప్పనిసరి అన్న సుప్రీం కోర్టు ఉత్తర్వులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి సత్వర చర్యలు చేపట్టాలని ఎస్టియు నాయకులు పేర్కొన్నారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా సోమవారం పోరుమామిళ్లలోని శాసనమండలి సభ్యులు డి.సి.గోవిందరెడ్డిని కలిసి ఇన్ సర్వీస్ టీచర్లను టెట్ నుండి మినహాయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఎస్టియు పక్షాన రీజనల్ కన్వీనర్ వి.వి.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించిన తదనంతరం రాష్ట్ర అదనపు ప్రధానకార్యదర్శి పి.రమణారెడ్డి మాట్లాడుతూ 30సంవత్సరాల సర్వీసు కలిగిన సీనియర్ ఉపాధ్యాయులను టెట్ రాయాలని చెప్పడం, ఉత్తీర్ణత సాధించకపోతే ఉద్యోగం నుండి తొలగిస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎమ్మెల్సీ గోవిందరెడ్డి మాట్లాడుతూ టెట్ పాస్ కాకపోతే ఉపాధ్యాయులను ఉద్యోగం నుండి తొలగిస్తామని చెప్పడం అన్యాయం అన్నారు. ఈ విషయమై శాసన మండలిలోనూ, పార్లమెంటులోనూ ఉపాధ్యాయుల పక్షాన పోరాడతామన్నారు. రాష్ట్ర కౌన్సిలర్లు చంద్రశేఖర్, చంద్రహాస్ రెడ్డి, పుల్లయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు గురయ్య, బాలరాజు, వెంకట సుబ్బయ్య, శ్రీనివాసులు, రీజనల్ ఆఫీస్ ఇన్చార్జి కస్తూరి శ్రీనివాసులు, మండలశాఖల ప్రధాన బాధ్యులు జయరామి రెడ్డి, శ్రీనివాసులు, వి.వి.నారాయణ, అబ్దుల్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అకడమిక్ ఇన్ స్ట్రక్టర్‌లను నియమించాలి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: కడప కార్పొ రేషన్ పరిధిలోని మున్సిపల్ పాఠశాలలో వి ద్యార్థుల సంఖ్య అనుగుణంగా ఉపాధ్యాయులు లేక విద్యార్థులు విద్యా బోధనకు ఇబ్బంది పడుతున్నారని, విద్యార్థులకు విద్యాబోధనకు ఆటంకలేకుండా అకడమిక్ ఇన్ స్ట్రక్టర్‌లను నియమించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శంషుద్దీన్‌ని కలిసి ఎస్టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రామాంజనేయులు, జిల్లా అధ్యక్షులు ఆవుల శ్రీనివాసులు జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ వినతిపత్రం ఇచ్చారు. రామాంజనేయులు మాట్లాడుతూ ఒక ఇందిరానగర్ హైస్కూల్లోని ప్రైమరీ క్లాసుల్లో 175మంది విద్యార్థులు ఉంటే ముగ్గురు టీచర్లు మాత్రమే ఉన్నారు. డీఈఓను కలిసిన వారిలో జిల్లా అధ్యక్షులు ఆవులు శ్రీనివాసులు జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

ప్రొవిజినల్ మెరిట్ లిస్టు విడుదల

విశాలాంధ్ర-కడప: మెడికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ ప్రిన్సిపల్ ఆఫీసు ప్రభుత్వ వైద్యశాల కడప సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కడప నందు కాంట్రాక్ట్ మరియు ఔట్సోర్సింగ్ పద్ధతిన జరుగు నియామకాలకు సంబంధించిన ప్రొవిజినల్ మెరిట్ లిస్టు ను కడప జిల్లా ప్రభుత్వ వెబ్సైట్ ఐన https//kadapa.ap.gov.in నందు 17వ తారీకున ఉంచడం జరిగింది. కావున అభ్యర్థులు పరిశీలించి మీ అభ్యంతరములు, గ్రీవెన్స్‌లను స్వయంగా ఆఫీసు పని సమయం నందు అనగా ఉదయం 10:30 నుండి సాయంత్రం 05:00 వరకు 18 నుండి 20తేదీ వరకు ఏడిఎం/ప్రిన్సిపాల్, ప్రభుత్వ వైద్య కళాశాల కడప నందు ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్ నందు మాత్రమే సమర్పించవలెను. పోస్ట్ ద్వారా పంపబడిన అభ్యంతరముల గ్రీవెన్స్ లను స్వీకరించబడవు. అని ప్రిన్సిపాల్ ఆఫీసు ప్రభుత్వ వైద్య కళాశాల కడప వారు తెలియజేయడమైనది. గ్రీవెన్స్ లను మరియు పోస్ట్ ద్వారా వచ్చినటువంటి అభ్యంతరముల, గ్రీవెన్స్ లను స్వీకరించబడవని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ తెలియజేసారు.

నూతన ఎంపీడీవోగా గౌస్

విశాలాంధ్ర-వీరబల్లి: వీరబల్లి నూతన ఎంపీడీవోగా గౌస్ సోమవారం బాధ్యతలు చేపట్టిన సందర్భంగా రాష్ట్ర ఎంపీపీల సంఘం ఉపాధ్యక్షులు గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసిన అభినందనలు తెలిపారు. వీరబల్లి మండల మారుమూల ప్రాంతములో ఉండగా వీరబల్లి మండల అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేయాలి అన్నారు. పార్టీలతో సంబంధం లేకుండా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందేలాగా చూసుకోవాలని అర్హులైన వారిని గుర్తించి ఎటువంటి తారతమ్యం లేకుండా ప్రజలకు సేవ చేసి మంచి పేరు సంపాదించుకోవాలని ఆయన అన్నారు.

అధికారులు ప్రజలను ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తప్పవు

విశాలాంధ్ర-ఖాజీపేట: ప్రజలను అధికారులు ఎవరైనా ఇబ్బంది పెట్టినట్టు తన దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ హెచ్చరించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం రెవిన్యూ అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్న మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను గాలికొదిలేసి నెలల తరబడి ప్రజలను ఆఫీస్‌ల చుట్టూ తిప్పుకోకుండా త్వరగతిన పరిష్కరించాలన్నారు. ముఖ్యంగా ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్లను మంజూరు చెయ్యటంలో ఆలస్యం పనికి రాదని, వారికి కావాల్సిన పత్రాలను వెంటనే అందించాలన్నారు. ఎక్కడైనా అధికారులు తమ విధుల పట్ల నిర్లక్షంగా వ్యవహరిస్తే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. తాసిల్దారు రవణమ్మ, ఎంపీడీఓ దివిజ సంపతి, రాష్ట్ర గ్రంథాలయ డైరెక్టర్ లక్ష్మి రెడ్డి, మండల రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

రేషనలైజేషన్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయండి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: జిల్లాలో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలని ఈఆర్ఓలను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని బోర్డ్ రూమ్ హాల్‌లో జరిగిన ప్రత్యేక సమగ్ర సవరణ 2026-పొలిటికల్ పార్టీ సమావేశంలో జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌తో కలసి ఈఆర్ఓలు, రాజకీయ పార్టీ ప్రతినిధులతో పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ... పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ప్రక్రియలో ప్రతిపాదించిన కేంద్రాలను స్వయంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం ధృవీకరించి ప్రతిపాదనలు సమర్పించాలని ఈఆర్ఓ, ఎఈఆర్ఓలను ఆదేశించారు. సదరు ప్రతిపాదనలను రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో పునఃపరిశీలన అనంతరం ఎన్నికల కమిషన్‌కు నివేదిక పంపిస్తామన్నారు. ఇందుకు సంబంధించి ప్రతి ఈఆర్ఓ, ఎఈఆర్ఓ తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాలను ప్రత్యక్షంగా సందర్శించాలని ఆదేశించారు. ప్రస్తుతం జిల్లాలో 1963 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, కొత్తగా 158 పోలింగ్ కేంద్రాల ప్రతిపాదనలు అందాయని తెలిపారు. రేషనలైజేషన్ తర్వాత జిల్లాలో మొత్తం 2121 పోలింగ్ కేంద్రాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ఇందులో పోలింగ్ కేంద్రాల పేర్ల మార్పు కోసం 11, పోలింగ్ కేంద్రాల స్థానాల మార్పుకు 19ప్రతిపాదనలు ఇందులో ఉన్నాయన్నారు. కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు సమయంలో ఒకే కుటుంబ సభ్యులు వేర్వేరు కేంద్రాల్లో ఉండకుండా, అందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఓటర్ల జాబితాలో నమోదు, చేర్పులు, మార్పులు, తొలగింపులు వంటి అంశాలను ఎన్నికల నిబంధనల మేరకు జాగ్రత్తగా చేపట్టాలని ఆయన ఆదేశించారు. వివిధ రాజకీయ పార్టీ ప్రతినిధులు ఈ సందర్భంగా నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై పలు సూచనలు ఇచ్చారు. డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు, ఈఆర్ఓలు జాన్ ఐర్విన్, చెన్నయ్య, సాయి శ్రీ, టిడిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు హరుణ్ బాబు,కాంగ్రెస్ పార్టీ నాయకులు సయ్యద్ గౌస్ పిర్, బిజెపి నాయకులు, జీఎస్పీ నాయకులు విశ్వనాథ్, లక్ష్మణరావు, బీఎస్పీ నాయకులు గుర్రప్ప, సిపిఐ (ఎం)నాయకులు చంద్రశేఖర్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు శ్రీనివాసులు, సిపిఐ నాయకులు మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

సౌదీలో రోడ్డు ప్రమాదంపై

సుగవాసి ప్రసాద్ బాబు దిగ్భ్రాంతి

విశాలాంధ్ర-రాయచోటి రూరల్: సౌదీ అరేబియాలో బస్సు-ట్యాంకర్ ఢీకొని ప్రమాదంలో 42మంది ప్రాణాలు కోల్పోవడం తీవ్ర విషాదకరం అని రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు తెలిపారు. మక్కా నుంచి మదీనా వెళ్తున్న మార్గంలో జరిగిన ఈ దుర్ఘటనలో హైదరాబాద్‌కు చెందిన వారు మరణించిన విషయం బాధాకరమని ఆయన పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన సుగవాసి ప్రసాద్ బాబు రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు నియోజకవర్గం టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడింది

- పిసిసి జనరల్ సెక్రెటరీ షేక్ అల్లాబకష్

విశాలాంధ్ర-రాయచోటి రూరల్: బీహార్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించలేక పోవడానికి ముఖ్య కారణం బీహార్ లో ఎన్నికల సంఘం ఎన్నో ఇబ్బందులను కల్పించిందని పిసిసి జనరల్ సెక్రెటరీ షేక్ అల్లా బకాష్ అన్నారు. సోమవారం ఆయన కార్యాలయంలో విలేకరితో మాట్లాడుతూ తల్లిదండ్రుల పుట్టిన తేదీ సర్టిఫికెట్లను సమర్పించాలంటూ తీవ్రమైన ఆంక్షలు విధించిందని, తద్వారా అత్యధిక సంఖ్యాకులు ఓటర్లుగా నమోదు చేసుకోలేకపోయారని ఆయన చెప్పారు. బీహార్ ఎన్నికల ఫలితాలు ఇండియా కూటమి పార్టీలను నిరాశపరిచాయన్నారు. భారత రాజ్యాంగం, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడ్డాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. స్వాతంత్ర ఉద్యమంలో ఎన్నడూ పాల్గొనని ఆర్ఎస్ఎస్ తపాలా బిళ్ళను, ఆ సంస్థ శత వార్షికోత్సవం సందర్భంగా, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం విడుదల చేయడం విడ్డూరంగా ఉందని ఆయన విమర్శించారు.

న్యాయవాదుల హక్కుల కోసం నిరంతర పోరాటం

విశాలాంధ్ర-రాయచోటి రూరల్: రాష్ట్రంలోనూ దేశంలోనూ అపరిష్కృతంగా ఉన్న న్యాయవాదుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తామని భారత న్యాయవాదుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, జాతీయ కార్యదర్శిఏపీ బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్‌కుమార్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ ఎన్నికలు సందర్భంగా అన్నమయ్య కడప జిల్లాలలో ఆయన 17న పర్యటన చేశారు. రాయచోటి న్యాయవాదులను ఉద్దేశించి లక్ష్మీపురంలోని కోర్ట్ ఆవరణంలో మాట్లాడారు. 1982లో జస్టిస్ కృష్ణయ్యర్ ఆధ్వర్యంలో దేశంలో ఏర్పడిన భారత న్యాయవాదుల సంఘం అప్పటినుండి న్యాయవాదుల సమస్యల పట్ల అంకితభావంతో పనిచేస్తూ రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తూ సేవా భవంతో ఐఏఎల్ ముందుకు కొనసాగుతుందని రాష్ట్రంలోని న్యాయవాదుల అనేక సమస్యలను పరిష్కరించడంలో ఐఏఎల్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా కృషి చేస్తుందని న్యాయవాదులు తమకు మరింత ప్రోత్సాహాన్ని ఇచ్చి బార్ కౌన్సిల్ సభ్యుడుగా మళ్లీ తనను గెలిపించినట్లయితే న్యాయవాదుల హక్కుల కోసం మరింతగా కృషి చేస్తానని న్యాయవాదులకు హామీ ఇచ్చారు.

పరిమితికి మించి విద్యార్థులను బస్సు ఎక్కిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-బద్వేలు: రాష్ట్రంలోని ప్రయివేటు ట్రావెల్స్ ప్రయివేటు విద్యాసంస్థలు ఎటువంటి ఆర్‌టిఎ నిబంధనల్ని పాటించకుండా విద్యార్థుల, ప్రయాణికుల ప్రాణాలతో చేగటం ఆడుతున్నాయి అని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా అధ్యక్షులు పెద్దులపల్లి ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేసారు. నిబంధలను పాటించకుండా బస్సులను తిప్పుతున్న యాజామాన్యాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ యువజన సమాఖ్య జిల్లా సమితి ఆధ్వర్యంలో ఈ రోజు ఉదయం బద్వేలు ఆర్డిఓ గారికి మరియు యంవిఐ గారికి వినతిపత్రమ ఇవ్వడం జరిగింది. ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో రవాణా శాఖ మామూళ్ల మత్తులో జోగుతూ, నిద్ర అవస్థలో ఉన్నదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రయివేటు ట్రావెల్స్ యాజమాన్యాలు ఆర్.టి.ఎ నిబంధలనలను బేఖాతరు చేస్తూ విచ్చలవిడిగా వారి దందాను కొనసాగిస్తున్నారని, ముఖ్యంగా ప్రయివేటు విద్యాసంస్థలు కనీస ఫిట్ నెస్ లేని బస్సులలో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించి, కనీస అనుభవం లేని డ్రైవర్లతో వాహనాలు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతుంటే ఆర్‌టిఎ అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తూ విద్యారుల భద్రతను ప్రశ్నర్థకంగా మారుస్తున్నారని, అదేవిధముగా ట్రావెల్స్ యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా పార్సిల్ కొరియర్ సర్వీసులను నిర్వహిస్తూ వారి బస్సులలో ఏమి రవాణా చేస్తున్నారో కూడా తెలియని విధముగా నిర్వహణ చేస్తున్నారని దుయ్యబట్టారు. యువజన సమాఖ్య నాయకులు మునిరత్నం, సుజన్ కుమార్, ముత్యాల రమణయ్య తదితరులు పాల్గున్నారు.

పలు సమస్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

విశాలాంధ్ర-రాయచోటి రూరల్: జిల్లా రాయచోటి కలెక్టరేట్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కి రోడ్లతో పాటుగా పలు సమస్యలపై పరిస్కారం కోసం అర్జీలు అందజేషిన రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం జనసేన నాయకులు రామ శ్రీనివాస్ మాట్లాడుతూ రాయచోటి, సుండుపల్లి, రాయచోటి-రాజంపేట రోడ్లపై ప్రజలు ఎదుర్కొంటున్న రవాణా సమస్యలు గురించి తీసుకెళ్లగా జిల్లా స్థాయి ఉన్నత అధికారులు స్పందిస్తూ ఇటీవల తాత్కాలిక మఱమ్మతులకు సంబంధించి రాయచోటి నుండి రాజంపేట రోడ్డుకు 2.75లక్షల కోట్ల రూపాయల అంచనా వ్యాయముతో మరియు రాయచోటి నుండి టి.సుండుపల్లి రోడ్డు కు 2.75 లక్షల కోట్ల రూపాయల అంచనా వ్యాయముతో అలానే టి.సుండుపల్లి మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ వద్ద 19 లక్షల రూపాయల వ్యాయముతో మొత్తం కలిపి 5కోట్ల 69 లక్షల రూపాయలకు నిధులు మంజూరు కావడం జరిగిందని ఆ పనులు పూర్తి కాగానే వాటి బిల్లులు రిలీజ్ అవ్వీన వెనువెంటనే శాశ్విత మఱమ్మతులకు శ్రీకారం చుడతామన్నారు. జనసేన నేత రామ శ్రీనివాస్ ప్రజలందరి తరపున ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి, సంబంధిత శాఖల ప్రభుత్వ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీ గ్రామాల వారీగా గ్రామాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని మండల అభివృద్ధి అధికారికి తెలుగు దేశం పార్టీ నాయకులు సోమిరెడ్డి పల్లె, సహకార పరపతి సంఘం చైర్మన్ యల్లటూరి సాంబశివరెడ్డి, మండల అభివృద్ధి అధికారి, రామ చంద్ర రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామ పంచాయతీల వారీగా గ్రామాల్లో అభివృద్ధిపై మౌలిక సదుపాయాలపై ప్రత్యేకంగా దృష్టి పెడుతున్నామని ప్రతి గ్రామంలో శానిటేషన్ పనులు వీధి దీపాల వరకు ప్రత్యేకంగా దృష్టి పెట్టామని తెదేపా నాయకులకు తెలిపారు. సాకార పరపతి సంఘం చైర్మన్ యల్లటూరి సాంబశివరెడ్డి మాట్లాడుతూ కొన్ని గ్రామాలలో డ్రైనేజ్ కాలువ నీళ్లు రోడ్లపై వస్తున్నాయని పైప్ లీకేజీ పనులు పూర్తి చేయకపోవడంతో నీరుతా రోడ్డు వీధి రోడ్లపై కోస్తున్నాయన్నారు. ఆ ప్రాంతాలలో పైప్ లైన్ ఏర్పాటు చేసి శానిటేషన్ పనులను చేపట్టాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌదరి వారి పల్లి మాజీ సర్పంచ్ భర్త సహకార పరపతి సంఘం డైరెక్టర్ చెవుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆటో అదుపుతప్పి నలుగురికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: మండల కేంద్ర పరిధిలోని బ్రహ్మ సాగర్ రిజర్వాయర్ వద్ద ఆటో అదుపుతప్పి నలుగురు మహిళలకు తీవ్ర గాయాలు కావడంతో బ్రహ్మ సాగర్ ను చూసేందుకు వెళ్లడంతో అక్కడ అదుపుతప్పి పోరు మామిళ్ల మండలం నాగులకుంట గ్రామానికి చెందిన వారు గుర్తించారు. మహిళలు నారాయణమ్మ సుధామణి, రాజమ్మ ఓబులమ్మ లకు వెంటనే తోటి యాత్రికులు వారిని బ్రహ్మంగారి మఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కొరకు తరలించారు. అక్కడనుండి మెరుగైన చికిత్స కొరకు పొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సింది ఉంది. ఈ సందర్భంగా పలువురు యాత్రికులు స్థానిక ప్రజలు మాట్లాడుతూ బ్రహ్మ సాగర్ రిజర్వాయర్ పైన రక్షణ కరువైందని కనీసం సైడ్ వాల్స్ లేకపోవడం చిన్నచిన్న ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రభుత్వం అధికారులు యాత్రికుల ప్రజలకు రక్షణ ఏర్పాట్లు చేయాలని గతంలో బ్రహ్మ సాగర్ రిజర్వాయర్ పైన స్తంభాలు పోల్స్ ఉండేవని కాలువ లీకేజ్ పనులతో తొలగించడంతో అక్కడ ఎలాంటి రక్షణ లేకపోవడంతోనే ప్రమాదాలకు గురిగవుతున్నారని ఇప్పటికైనా ప్రభుత్వం బ్రహ్మ సాగర్ రిజర్వాయర్ పైన రోడ్డు నిర్మాణం పనులు సాగర్ పైన సైడ్ వాల్స్ రక్షణకు ఏర్పాటు చేయాలని యాత్రికులు స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం లక్ష్యం: భూపేష్ రెడ్డి



విశాలాంధ్ర-మైలవరం: రాష్ట్ర ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యం అని జమ్మలమడుగు టిడిపి ఇంచార్జి భూపేష్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అగస్తేశ్వర కోన, నక్కవాని పల్లెలో ఉన్న వెంకటేశ్వర స్వామి కోనలలో ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. అనంతరం భూపేష్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం సీఎం చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలను సూపర్ హిట్‌గా అమలు చేస్తున్నారని సంక్షేమ పథకాల అమలును ఓర్వలేక ప్రతిపక్షం విమర్శలు చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్తీకమాసం సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించి రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని భగవంతుని కోరుకున్నట్లు పేర్కొన్నారు. టిడిపి నేతలు రాజారెడ్డి, ఎంపిటిసి బాలకొండయ్య, నక్కవాని పల్లె మాజీ సర్పంచ్ రామచంద్రుడు యాదవ్, మహేశ్వరరెడ్డి, సునీల్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, వివేకానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకోన మల్లేశ్వర స్వామి తిరునాల



విశాలాంధ్ర-లింగాల: లింగాల మండలం పార్నపల్లి సమీపంలో వెలసిన శ్రీ కోన మల్లేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతి సంవత్సరం అద్భుతంగా జరిగే కార్తీక మాసం తిరుణాల ఈసారి కూడా భక్తుల సందోహంతో అంగరంగ వైభవంగా సాగాయి. కార్తీక మాసం ఆఖరి సోమవారం సందర్భంగా చుట్టుపక్కల గ్రామాలతో పాటు అనంతపురం జిల్లాలోని భక్తులు కూడా పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం నాలుగు గంటల నుంచి సాయంత్రం ఎనిమిది గంటల వరకు జరిగిన దీపారాధన మహోత్సవం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్తీక మాసం వచ్చిందంటే శివాలయాలు భక్తులతో కిటకిటలాడటం ఆనవాయితీ. ఈసారి కూడా మొదటి వారం నుంచి నాలుగు వారాల పాటు భక్తిశ్రద్ధతో సాగిన పూజల్లో భక్తులు కాయ, కర్పూరాలను సమర్పించి భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఆలయ కమిటీ భక్తుల కోసం ఉదయం 9 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు నిత్య అన్నదానాన్ని నిర్వహించింది. వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యాలు లేకుండా అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేశారు కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు. భక్తుల అధిక రద్దీ దృష్ట్యా పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు చేపట్టారు. అవాంఛనీయ ఘటనలు ఏవీ చోటుచేసుకోకుండా భద్రతా చర్యలను పటిష్టంగా అమలు చేశారు పోలీస్‌లు. తిరుణాలకు పెద్ద ఎత్తున వచ్చిన భక్తులు స్వామివారి దర్శనం చేసుకుని ఆనందభరితులయ్యారు. ఈసారి కూడా పార్లపల్లి కోనలో తిరుణాల అత్యంత శోభాయమానంగా, శ్రద్ధా భక్తులతో కూడిన వాతావరణంలో ఘనంగా ముగిసింది.

మన్నించు గణేశా..!

మురుగునీటిలో వినాయకుడి ప్రతిమలు..

ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి..

విశాలాంధ్ర -ఎర్రగుంట్ల : స్థానిక పురపాలిక వినాయక నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో వినాయకుడి ప్రతిమల తయారీ కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. ఈ ఏడాది విక్రయించగా మిగిలిపోయిన బొమ్మలను అలాగే ఉంచారు. భారీ వర్షాల కారణంగా వర్షపునీరు ఆ స్థలంలో పెద్ద ఎత్తున నీలిచి మురుగుగా మారి ఉంది. ఈ నీటిలోనే కొన్ని సదరుప్రతిమలు ఉండగా మరికొన్ని నీటిలో పడి తేలుతున్నాయి. ఈ దృశ్యాన్ని చూస్తున్న గణేశు డి భక్తుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. పవిత్ర స్థలాల్లో ఉంచి భక్తిశ్రద్ధలతో పూజించాల్సిన వినాయకుడి ప్రతిమలు దుర్వాసన వెదజల్లబడుతున్న మురుగు నీటిలో తేలియాడుతుండ టం పట్ల భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదేమి చోద్యమంటూ నిట్టూరు స్తున్నారు. గణేశా మన్నించు అంటూ వేడు కుంటూ నిర్వాహకులకు శాపనార్థాలు పెడుతున్నారు. ధనార్జనే ధ్యేయంగా ప్రతిమల వ్యాపారాన్ని కొనసాగిస్తున్న నిర్వాహకులు భగవంతుడి పట్ల కనీస కృతజ్ఞతా భావం కూడా వ్యక్తం చేయకపోవడం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ శేష పని మాట్లాడుతూ సదరు స్థల యజమాని, ప్రతిమల తయారీ వ్యాపారికి నోటీసులు జారీ చేస్తామని స్పందించకపోతే పురపాలిక పక్షాన చర్యలు తీసుకుంటామన్నారు. చర్యలు లేని పక్షంలో గణేశు డి భక్తులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక దృష్టికి తీసుకుపోవాలని నిర్ణయించినట్లు తెలిసింది.

ఘనంగా 58 వ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-కలికిరి : గ్రంథా లయ వారోత్సవాలలో భాగంగా సో మవారం కలికిరిలోని శాఖ గ్రంథాలయంలో ఘనంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి కలికిరి మండల అధ్యక్షుడు కేఎస్ షాబుద్దీన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సదుం మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ వీజీ నటరాజ, వేంపల్లి అబ్దుల్ ఖాదర్, జూనియర్ కళాశాల తెలుగు అధ్యాపకులు మోహన్ రెడ్డి, రిటైర్డ్ టీచర్ రమేష్, మండల విద్యాశాఖ అధికారి2 నాగార్జున పాల్గొని విద్యార్థులకు గ్రంథాలయాల ఆవశ్య కతను వివరించారు. ప్రధానోపాధ్యాయులు నటరాజకు, ప్రముఖ కవి వేంపల్లి అబ్దుల్ ఖాదర్‌కు గ్రంథాలయ అధికారి విజయకుమార్ సత్కరించారు.

పంచాయతీ కార్యాలయానికి భూమి పూజ

విశాలాంధ్ర-చెన్నూరు : మండల పరిధి లోని కొక్కరాయపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం కోసం సోమ వారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నర్సింహారెడ్డి భూమి పూజ చేశారు. ఆ గ్రామ నాయకుడు వాసుదేవ రెడ్డి స్థలాన్ని కొని పంచాయతీ కార్యాలయానికి రిజిస్టర్ చేపించారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ రూ.32 లక్షలతో పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించారన్నారు. ఇప్పటికే గ్రామంలో రూ.2 కోట్ల తో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. సిసి రోడ్లు, డ్రైనేజీలు, వాటర్ పైపులైను ఏవైనా అవసరమైతే పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కల్లూరు విజయభాస్కర్ రెడ్డి, కేసీ కెనాల్ డిసి ప్రెసిడెంట్ బుజ్జన్న, నాగేశ్వర్ రెడ్డి, చెన్నూరు రాంప్రసాద్ మల్లికార్జునరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, పంచాయతీరాజ్ విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

ప్రియదర్శన్‌కు పదోన్నతి.. అన్నమయ్య జిల్లా కోడూరుకు బదిలీ..

విశాలాంధ్ర- ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల ఏపీఎస్పీడీసీఎల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా విధులు నిర్వహి స్తున్న ప్రియదర్శన్ రెడ్డికి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పదోన్నతి లభించింది. ఆ మేరకు పదోన్నతి కల్పిం చిన ఉన్నతాధికారులు ఈయనను అన్నమయ్య జిల్లా కోడూరుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎర్ర గుంట్లలో విధులు నిర్వహించిన సమయంలో ప్రియ దర్శన్ రెడ్డి వినియోగదారుల సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత నిస్తూ ఈ ప్రాంత ప్రజల మన్ననలు పొందారు. వినియోగదారుడు ఏదేని సమస్యపై కార్యాలయాన్ని సంప్రదించిన సమయంలో వెంటనే స్పందించే వారన్న ఖ్యాతి గడించారు.కాగా ప్రియదర్శన్ రెడ్డికి పదోన్నతి లభించడం పట్ల ఈ ప్రాంత వాసులతోపాటు విద్యుత్, ఉద్యోగులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా బూచు పల్లె వారి వివాహ వేడుక..

నూతన వధూవరులను ఆశీర్వదించిన భూపేష్

విశాలాంధ్ర-ఎర్రగుంట్ల: తుమ్మల పల్లెకు చెందిన సివిల్ కాంట్రాక్టర్, ఎన్డీఏ కూటమి నేతలు బూచు పల్లె గంగాధర్ రెడ్డి సోదరి సుమలత వివాహ వేడుక ఘనంగా జరిగింది. జమ్మలమడుగు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి చది పిరాళ్ల భూపేష్ రెడ్డి, ఎన్డీఏ కూటమి మండల పర్యవేక్షకులు తప్పెట్ల మధుసూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ అధ్యక్షులు ఆర్ నాగరాజుతోపాటు పలువురు నేతలు వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులైన సుమలత, శ్రీనివాసుల రెడ్డి దంపతులను ఆశీర్వదించారు. గంగాధర్ రెడ్డి జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, టిడిపి ఇన్చార్జి భూపేష్ రెడ్డి ముఖ్య అనుచరుడిగా కొనసాగుతుండడం, ఇక్కడి సిమెంట్ పరిశ్రమలతో పాటు, ఇతరత్రాచోట్ల సివిల్ కాంట్రాక్టు పనులు చేస్తుండడంతో వివాహ వేడుకకు రాజకీయ రంగ ప్రముఖులు, వాణిజ్య, వ్యాపార, ఈ ప్రాంత ప్రముఖులు పెద్ద సంఖ్యలో హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. గంగాధర్ రెడ్డి బంధువులు, హితులు, స్నేహితులు, సన్ని హితులు, శ్రేయోభి లాషులు వేడుకకు హాజరై కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

చంద్రబాబు మైనారిటీల పక్షపాతి :ఎమ్మెల్యే షాజహాన్ భాష

విశాలాంధ్ర-మదనపల్లె: మైనారిటీల అభ్యున్నతి కోసం ఎల్లవేళలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే షాజ హాన్ భాష పేర్కొన్నారు. టీడీపీ కార్యా లయంలో ముస్లిం మత పెద్దలతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ షాదీ మహల్ లు , హజ్ హౌస్ నిర్మాణం, ఇమామ్, మౌజం లకు జీతాలు, ఉర్దూ పండిట్లు మసీదులు అభివృద్ధి వర్కు ఆస్తుల రక్షణ ఇలా ఎన్నో పథకాలను ముస్లిం మైనారిటీల అభివృద్ధి కోసం చేపడుతూ... ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ముస్లింల పక్షపాతిగా నిలుస్తున్నారని అన్నారు... ఇమామ్, మౌజమ్‌కు 90 కోట్ల రూపాయల వేతన బకాయిలు అందించి ముస్లింల సమాజానికి అండగా నిలుస్తున్నారని అన్నారు..ఈ సమావేశంలో ముస్లిం సోదరులతో పాటు ఇమామ్, మౌజమ్ పాల్గొన్నారు.

రచ్చబండ కార్యక్రమాలకు తరలిరండి

విశాలాంధ్ర- నిమ్మనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం పిపిపి విధానం ద్వారా చేపడుతున్న మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ అధిష్టానం రచ్చబండ కార్యక్రమం ద్వారా కోటి సంతకాల సేకరణకు పిలుపునిచ్చిందని నిమ్మనపల్లి మండల వైసీపీఅధ్యక్షులు కొమ్మేపల్లి శ్రీనివాసులు రెడ్డి అన్నారు. ఇందులో భాగంగా మంగళవారం మదనపల్లి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త నిస్సార్ అహ్మద్ నిమ్మనపల్లి మండలంలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉదయం గం.10 లకు చల్లావారిపల్లె, గం.11లకు నల్లంవారిపల్లె, మధ్యాహ్నం గం.12 లకు వెంగంవారిపల్లె, గం.2లకు సామకోటవారిపల్లె, గం.3లకు అగ్రహారం, గం.4లకు నిమ్మనపల్లెలో రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించి మెడికల్ కాలేజీల ప్రైవేటీకర ణను వ్యతిరేకిస్తూ సంతకాలను సేకరిస్తున్నట్లు తెలిపారు.

ఆడపిల్లలను కాపాడుదాం.. వారిని చదివిద్దాం

విశాలాంధ్ర- నిమ్మనపల్లె : మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఐసిడిఎస్ సూపర్వైజర్లు ధనలక్ష్మి, కుసుమారాణి ల ఆధ్వర్యంలో " భేటీ బచావో బేటి పడావో " కార్యక్రమం పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ నారాయణ, ఏఓ రమేష్ బాబు, డిప్యూటీ ఎంపీడీఓ బాలరాజు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆడపిల్లల లింగ నిష్పత్తిని కాపాడడం వారికి విద్యను చేరువ చేయాలని లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం " భేటీ బచావో బేటి పడావో" కార్యక్రమం తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం మురళి, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయంలో ఆకట్టుకున్న కవి సమ్మేళనం

విశాలాంధ్ర-మదనపల్లె : 58వ జాతీయ గ్రంథాలయ వారోత్స వాలలో భాగంగా సోమవారం గ్రంథాలయాధికారిణి ఆర్.వసంత కుమారి ఆధ్వర్యంలో కవిసమ్మే ళనం నిర్వహించారు.ఈ కార్య క్రమానికి మదనపల్లి రచయితలు సంఘం ప్రధాన కార్యదర్శి లింగాల యుగంధరాచారి,సాయి చైతన్య కాలేజీ చైర్మన్ డాక్టర్ నిర్మల్ కుమార్ రెడ్డి,డాక్టర్ అప్సర్ ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా డాక్టర్ అప్సర్ విద్యార్థినులకు చిన్న,చిన్న కథలతో వారి విద్యాభ్యాసం ఎలా ఉండాలో వివరించి చెప్పారు.అనంతరం శ్రీసాయి చైతన్య కాలేజీ చైర్మన్ నిర్మల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ విద్యాభ్యాసం కాలంలో తాము గ్రంథాలయాలను ఏవిధంగా ఉపయోగించుకున్నారో అనే విషయం తెలిజేశారు.విద్యార్థులు మొబైల్ ఫోన్లు పక్కన పెట్టేసి సెలవులు,ఖాళీ సమయంలో గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలని తెలియజేశారు.అదేవిధంగా లింగాల యుగంధరాచారి అధ్యక్షతన జరిగిన కవితోత్సవంలో భాగంగా కవులైన లింగాల యుగంధరాచారి, శరత్ బాబు,రామ్మోహన్ నాయుడు,రామ్మోహన్ రెడ్డి,నాగభూషణం రావు,హేమలత, లక్ష్మీ ప్రసన్న,కుమారస్వామి,రాఘవేంద్ర బాబు,ఖాదర్ భాషా కవులు,కవయిత్రులు తమ తమ కవితలతో పిల్లలను పాఠకులను ఆకట్టుకున్నారు.ఈ కార్యక్రమంలో శ్రీసాయి చైతన్య జూనియర్ కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు మాజీ సీఎం నల్లారి కిరణ్ కలికిరికి రాక

విశాలాంధ్ర-కలికిరి : మాజీ ముఖ్యమంత్రి, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి ఈనెల 18న కలికిరికి రానున్నారు. మంగళవారం ఉదయం హైద రాబాదులో బయలుదేరి మధ్యాహ్నం 12:00 గంటల 25 నిమిషాలకు రేణిగుంట విమానాశ్రమం చేరుకుంటారు. అనంతరం 12:35 గంటలకు విమానా శ్రయం నుండి బయలుదేరి రోడ్డు మార్గంలో మధ్యాహ్నం రెండు 2:35 నిమిషాలకు కలికిరికి చేరుకుంటారని ఆయన వ్యక్తిగత కార్యదర్శి కృష్ణప్ప తెలిపారు. కలికిరి బిజెపి కార్యాలయంలో రెండు రోజులు పాటు నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు.

మాల మహానాడు జిల్లా ఉపాధ్యక్షులుగా గుండ్లూరు విజయ్ కుమార్

విశాలాంధ్ర-కలికిరి : మదన పల్లిలో మాల మహానాడు జాతీ య వర్కింగ్ ప్రెసిడెంట్ రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షులు యమల సుదర్శన్ ఆధ్వర్యంలో మాలమహానాడు సభలను నిర్వ హించి విజయవంతంగా కొనసాగించారు. ఈ మాల మహానాడు సభలో కొత్త కమిటీ నియమించినారు ఈ కమిటీలో అన్నమయ్య జిల్లా ఉపాధ్య క్షులుగా కలికిరి ఇందిరమ్మ కాలనీకి చెందిన గుండ్లూరు విజయ కుమార్‌ను ఉపాధ్యక్షులుగా నియమించారు. విజయ్ కుమార్ మాట్లాడుతూ నేను మాల మహానాడు సంఘానికి నా వంతు కష్టపడి పని చేస్తానన్నారు. నాకు అవకాశం కల్పించిన మాలమహా నాడు అధికార ప్రతినిధి హరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మనోహర్, మోహన్, చంద్ర, ఎన్టీ రమణ, రామ కృష్ణ, సహదేవ, హరి, సతీష్, అంకన్న, పలవలి రమణ, గుండ్లూరు వెంకటరమణ, విశ్వనాథ, శ్రీను, అర్జున, తదితరులు పాల్గొన్నారు.

భానుకోట సోమేశ్వరుని దర్శించుకున్న స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్

విశాలాంధ్ర- సింహాద్రిపురం : మండల పరిధిలోని భానుకోట క్షేత్రంలో వెలసిన భానుకోట సోమేశ్వరుని కార్తీక మాసం చివరి మాసం సందర్భంగా ఢిల్లీ స్పోర్ట్స్ అథారిటీ కేలో ఇండియా డైరెక్టర్ కె .హిమబిందు, ఐఏఎస్ దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకుడు బద్రీనాథ్ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా ఆహ్వానించి విశేష పూజలు నిర్వహించి ఆమెకు తీర్థ ప్రసాదాలు అందించారు.

క్రికెటర్ శ్రీ చరణికి పిఆర్ అభినందనలు..

విశాలాంధ్ర- ఎర్రగుంట్ల : మహిళల వన్డే వరల్డ్ కప్‌లో అద్భుత ప్రదర్శన కనపరచి జట్టును గెలిపించడంలో కీలక పాత్ర పోషించిన నల్లపురెడ్డి శ్రీ చరణిని మాజీ మంత్రి, శాసన మండలి సభ్యులు పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి ఆయన సోదరుడు మాజీ ఎంపీపీ గిరిధర్ రెడ్డి అభినం దించి శుభాకాంక్షలు తెలిపారు. శ్రీచరణి భవిష్యత్తులో మరింత ఎద గాలని ఈ సందర్భంగా పిఆర్ ఆకాంక్షించారు. ఈ విజయం వెనుక ఆమెను ప్రోత్సహించిన మామ కిషోర్ కుమార్ రెడ్డి, సహకరించిన తల్లిదండ్రుల కృషి కూడా ఉందని ఎమ్మెల్సీ కితాభిచారు. ఎన్ని కష్టాలు ఎదురైనప్పటికీ ఆమె పాదాలు మైదానం వైపు మల్లడంక్రీడల పట్ల శ్రీ చరణికి ఉన్న ఇష్టాన్ని గుర్తుకు తెస్తోందని పిఆర్ పేర్కొన్నారు. క్రికెటర్ తండ్రిని వీరు సత్కరించి వారికి శ్రీ చరణి చిత్రపటాన్ని అందజేశారు.

మిట్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్ ప్రధానం

విశాలాంధ్ర-మదనపల్లె: మిట్స్ సీనియర్ అసిస్టెంట్ డైరెక్టర్ (అడ్మిషన్స్) మరియు కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ లో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న వి మారుతి ప్రసాద్‌కు తమిళనాడులోని చెన్నైలో గల సత్యభామ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీమ్డ్ టు బి యూనివర్సిటీ) వారు డాక్టర్ పట్టాను అందజేసినట్లు మిట్స్ డీమ్డ్ టు బీ యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సి. యువరాజ్ తెలిపారు. సత్యభామ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీమ్డ్ టు బి యూనివర్సిటీ) లోని కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ విభాగము నుండి పిహెచ్‌డి డిగ్రీ పొందినట్లు, అక్కడే పనిచేస్తున్న ప్రొఫెసర్ బి. భారతి పర్యవేక్షణలో "యాన్ ఇంటెలిజెంట్ మల్టీమోడల్ సెక్యూరిటీ ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఎమర్జింగ్ అప్లికేషన్స్ యూజింగ్ ఐఓటి" అను అంశం పై చేసిన పరిశోధన కు గాను డాక్టర్ పట్టా ను అందజేసినట్లు ఆయన అన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

విశాలాంధ్ర-సంబేపల్లె: మంగళవారం జరగవలసిన మండల ప్రజా పరిషత్ జనరల్ బాడీ మీటింగ్ కొన్ని అనివార్య కారణాల వలన వాయిదా వేయడం జరిగినదని ఎంపీడీవో వెంకటసుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా అధికారులకు సమావేశానికి హాజరు కానవసరం లేదని తెలియజేశారు. తరువాత జరుగు మండల ప్రజాపరిషత్ జనరల్ బాడీ మీటింగ్ (సర్వ సభ్య సమావేశం) గురించి త్వరలోనే తెలియజేస్తామని పేర్కొన్నారు.

సంక్షిప్త వార్తలు

అవినీతిని నిర్మూలించాలని జేసీకి వినతి

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఎమ్మారై స్కాన్, సిటీ స్కాన్ ఫిలిం ప్రభుత్వం సరఫరా చేయనందున పెద్ద ఎత్తున అవినీతి జరుగుతుందని పొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ ఇర్ఫాన్ భాష లేవనెత్తడంతో దానిపై సోమవారం జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి అవినీతి జరగకుండా ప్రజలకు ఇబ్బంది కలగకుండా సిటి స్కాన్ ఎంఆర్ఎఫ్ స్కాన్లను ఉచితంగా చేయాలని జాయింట్ కలెక్టర్‌కి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయజ్యోతి చెప్పడం జరిగింది. అందుకు స్పందిస్తూ కలెక్టర్ ఇకపై సమస్య జరగకుండా చూసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ సయ్యద్ గౌస్ పీర్, ప్రొద్దుటూరు నగర అధ్యక్షుడు గోసంగి సుబ్బారెడ్డి తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కిడ్నాపర్ అరెస్టు

విశాలాంధ్ర-పులివెందుల: లింగాల పోలీస్ స్టేషన్ పరిధిలో ఫోక్సో చట్టం మేరకు నమోదైన కిడ్నాప్‌ను అరెస్టు చేసినట్లు రూరల్ సిఐ వెంకటరమణ తెలిపారు. ఈ విషయాన్ని ఆయన సోమవారం స్థానిక స్టేషన్‌లో మీడియాకు వివరించారు. ఆయన మాట్లాడుతూ లింగాల మండలం గుణకనపల్లె గ్రామంలో ఈ నెల 7వ తేదీన మైనర్ కిడ్నాప్‌నకు గురైందన్నారు. మైనర్ బాలికను సదరు గ్రామ నివాసి ఇమ్రాన్ అను వ్యక్తి కారులో కిడ్నాప్ చేసినట్లు నిర్ధారించామన్నారు. ఆ మేరకు ఎస్పీ నచికేతన్, డిఎస్పీ మురళీనాయక్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేశామన్నారు. తన పర్యవేక్షణలో లింగాల స్టేషన్ ఎస్ఐ అనిల్‌కుమార్ దర్యాప్తును ప్రారంభించారన్నారు. ఆదివారం పార్నపల్లె-మురారి చింత క్రాస్ వద్ద కిడ్నాపర్ ఇమ్రాన్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. కిడ్నాప్ చేసినట్లు ఇమ్రాన్ అంగీకరిచండంతో సోమవారం కోర్టుకు హాజరుపరచగా మేజిస్ట్రేట్ రిమాండ్ విధించినట్లు సిఐ వెల్లడించారు.

రక్తదానం చేయండి-ఒక జీవితాన్ని కాపాడండి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రి నందు చికిత్స పొందుతున్న పుష్పావతి అనే మహిళకు రక్తం తక్కువ ఉండటంతో బి పాజిటివ్ రక్తం అత్యవసరం కా గా వారు మే ఐ హెల్ప్ యు ఫౌండేషన్ ఫౌం డర్ మోరే లక్ష్మణ్ రావును సంప్రదించగా వారు వెంటనే స్పందించి ఫౌండేషన్ సభ్యు డు మైకేల్ బాబు చేత స్థానిక ప్రభుత్వ గవ ర్నమెంట్ హాస్పిటల్ నందు బి పాజిటివ్ రక్త దానం చేయించారు. ఫౌండేషన్ ఫౌండర్ మోరే లక్ష్మణ్ రావు, టౌన్ ప్రెసిడెంట్ సుబ హాన్, వైస్ ప్రెసిడెంట్ మునీంద్ర, కృపా అ గ్ని షారోన్ ట్రస్ట్ సుమన్ బాబు, ప్రసన్న కుమార్, పాపిశెట్టి వెంకట లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు. రక్త దాత అయినటువంటి మైకేల్ బాబుకు ధన్యవాదాలు తెలిపారు.

ఏపీని ఇండస్ట్రియల్ హబ్‌గా చేయడమే చంద్రబాబు లక్ష్యం

- ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడిదారులను ఆహ్వానించి పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే కాకుండా ఏపీని ఇండస్ట్రియల్ హబ్‌గా చేయడమే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి స్పష్టం చేశారు. నెహ్రూ రోడ్డులోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరదరాజుల రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారాలోకేష్‌లు అన్ని దేశాలు తిరిగి పెట్టుబడి దారులను ఆహ్వానిస్తున్నారని అన్నారు. ఇటీవల విశాఖపట్నంలో పెట్టుబడి దారుల సమావేశం ఏర్పాటు చేసి 13లక్షల కోట్ల రూపాయలు పైబడి పెట్టుబడులు, 613 ఒప్పందాలు చేసుకోవడం జరిగిందన్నారు. రాష్ట్రంలో 3ప్రాంతాలు అభివృద్ధి చెందాలన్న ఆశయంతో 3 ప్రాంతాలలో పరిశ్రమల ఏర్పాటు కోసం కృషి చేస్తున్నారని అన్నారు. రాయలసీమ ప్రాంతం అభివృద్ధి చెందాలన్న ఆశయంతో జిల్లాలో చింతా, ఎక్స్ ట్రా, జాన్ అపార్ట్ పరిశ్రమలు ఏర్పాటుచేసి ఈ ప్రాంతాల్లోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ముందడుగు వేస్తున్నారని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, వీఎస్ ముక్తియార్, బేపారి జాకీర్ అహమ్మద్, చంద్ర ఓబుల్ రెడ్డి, మురళీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని సోమవారం నాడు బాల బాలికల గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి ఉమాదేవి ఆధ్వర్యంలో క్విజ్, కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రంలో జింక సుబ్రమణ్యం, 40మంది విద్యార్థులు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీలు పూర్వీకుల వారసత్వం: ఎమ్మెల్సీ

విశాలాంధ్ర-పులివెందుల: జాతరలు, తిరుణాళ్లు, ఉత్సవాలల్లో ఏర్పాటు చేసుకునే సంప్రదాయ బండలాగుడు పోటీలు మన పూర్వీకుల వారసత్వమని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి తెలిపారు. వేముల మండలం నారేపల్లి సమీపంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మోపూరి బైరవక్షేత్రం ప్రాంతంలో ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. కార్తీకమాసం పురస్కరించుకుని నిర్వహించిన ఈ బండలాగుడు పోటీలకు ఆయనతో పాటు పులివెందుల జెడ్పీటీసీ మారెడ్డి లతారెడ్డి హాజరయ్యారు. ఈ పోటీలను తిలకించేందుకు ఉమ్మడి కడప జిల్లానే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు విచ్చేశారు. అలాగే ఈ పోటీలలో ఉభయ తెలుగు రాష్ట్రాల లోని వివిధ జిల్లాల నుంచి వృషభ రాజములు వచ్చాయి. పోటీదారులు ఉత్సాహంగా పాల్గొని తమ ఎద్దుల జట్ల సామర్థ్యాన్ని ప్రదర్శించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై పోటీలను ఉత్సాహంగా వీక్షించారు. ఈ సందర్భంగా రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రైతు సోదరుల శ్రమ, వారి జీవన విధానం, పశుసంవర్ధన పట్ల ప్రేమను ప్రపంచానికి పరిచయం చేసే ఇటువంటి కార్యక్రమాలు సంప్రదాయ పోటీలకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. ఇలాంటి సంప్రదాయ ఉత్సవాలు తరతరాలకు నిలిచి ఉండాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మొపూరి దేవాలయం ఛైర్మన్ ఓబులరెడ్డి రమణారెడ్డి, కడప పార్లమెంట్ కార్యదర్శి బొజ్జా మైసూరా రెడ్డి, తాళ్ళపల్లి వెంకటేశ్వర రెడ్డి, ఓబులరెడ్డి శ్రీనివాసుల రెడ్డి, చంద్ర, ముచ్చుమర్రి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజమల్లువి డైవర్ట్ రాజకీయాలు

- డాక్టర్ జీవీ ప్రవీణ్ కుమార్ రెడ్డి

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: మాజీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి మహర్షి స్కూల్, డీఏడబ్ల్యూ కళాశాలకు చెందిన స్థలాలలో డబ్బులు తీసుకున్న విషయాన్ని ప్రజలు మరచి పోవాలనే ఎగ్జిమిషన్ డబ్బులు మున్సిపాలిటీకి జమ చేయాలని రిలే దీక్షలు చేపడుతున్నారని, ఇది పొద్దుటూరు ప్రజలు గమనించాలని టీడీపీ మాజీ ఇంచార్జ్ డాక్టర్ జీవీ ప్రవీణ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మా జాతమల్లో ప్రసాద్ రెడ్డి ఓటమికి గల కారణాల గురించి విశ్లేషించకుండా ఎగ్జిమిషన్ డబ్బులు కట్టాలని ప్రజల ఆలోచనలను పక్కదారి పట్టించడమే అన్నారు. మహర్షి స్కూల్ విషయంలో కోర్టులో పిల్ వేస్తానని చెప్పిన రాచమల్లు ఎందుకు వేయలేదు, తనకు డబ్బులు దండుకున్నాడు కాబట్టి కోర్టులో పిల్ వేయలేదన్నారు. అలాగే డీఏడబ్ల్యూ కళాశాలలో డబ్బులు తీసుకోలేదా అని ప్రశ్నించారు. ప్రస్తుతం ఎగ్జిబిషన్ టెండర్ తీసుకున్న మాడెం సుధాకర్ రెడ్డి తెలుగుదేశం పార్టీకి చెందిన మా పార్టీ వాడే అయితే వైసీపీ హయంలో డబ్బులు ఎగ్గొట్టిన వారి నుండి కూడా మున్సిపాలిటీకి జమ చేయించేలా రాచమల్లు కృషి చేయాలన్నారు. వైసిపి హయాంలో ఫ్రీ ఎంట్రీ పెట్టమని, జీఎస్టి ఎలా ఎగొట్టారని ప్రశ్నించారు. డిఏడబ్ల్యు కళాశాల విషయంలో 70 లక్షలు తీసుకోలేదా అని రాచమల్లును సూటిగా ప్రశ్నించారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు రాచమల్లుకు ముడుపులు ఇచ్చి ఉంటే ప్రశ్నించే వాడు కాదన్నారు. ఏది ఏమైనా తన అవినీతిని కప్పి పుచ్చుకునేందుకే డైవర్ట్ రాజకీయాలు చేస్తున్నారని అన్నారు.

విజ్ఞాన కేంద్రాలుగా గ్రంధాలయాలు

- సబ్ జైల్ సూపర్‌ఇంటెండెంట్ హర్షవర్ధన్ రెడ్డి

విశాలాంధ్ర-మైలవరం: చారిత్రక విజ్ఞాన కేంద్రాలుగా గ్రంధాలయాలు ఉన్నాయని జమ్మలమడుగు సబ్ జైలు సూపర్డెంట్ హర్షవర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం ఉదయం పట్టణంలోని గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పురాతన నాణెములు, నోట్లను ప్రదర్శనను ఆసక్తిగా పరిశీలించి, గ్రంధాలయ పితామహులు పద్మశ్రీ అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం హర్షవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పురాతన స్వదేశీ, విదేశీ నాణెములు మరియు నోట్ల ప్రదర్శన సాంస్కృతిక వారసత్వాన్ని తెలిపేందుకు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. విద్యార్థులకు నాటి పాలకుల ఆర్థిక, సాంస్కృతిక, పరిపాలన పరిస్థితులను తెలుసుకోవడానికి ఇవి ఎంతగానో అవసరం అన్నారు. గ్రంథాలయాధికారి నాదెండ్ల బాబ్జీ, రాయలసీమ పురాతన నాణెములు సేకరణ సంఘం సభ్యులు రంగనాథన్, లైబ్రరీ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి మిరియాల శివ గణపతి, కోశాధికారి అమీర్ భాష, ఉపాధ్యక్షులు డాక్టర్ నరసింహులు, వేంకటేశ్వర రెడ్డి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైవీయూ బయోకెమిస్ట్రీ స్కాలర్ నవీన్‌కు డాక్టరేట్

విశాలాంధ్ర-కడప వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం బయోకెమిస్ట్రీ స్కాలర్ నవీన్‌కు వైవియూ డాక్టరేట్‌ను ప్రకటించింది. స్కాలర్ నవీన్ ఆ శాఖ ఆచార్యులు రామచంద్రారెడ్డి పర్యవేక్షణలో "ప్రినటెల్ ఎక్స్పోజర్ ఆఫ్ జస్టోరెటిక్ ఆన్ మేల్ అండ్ ఫిమేల్ రేప్రొడెక్టివ్ హెల్త్ ఇన్ విస్టర్ ర్యాట్స్ "అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంధాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి మార్గదర్శకం మేరకు నియమితులైన పరీక్షకుల బోర్డు అలానే వైవా వోస్ కమిటీ సిఫార్సుల ఆధారంగా నవీన్ థీసిస్ డాక్టరేట్‌నకు అర్హత ఉన్నట్లు ప్రకటించారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ కంట్రో లర్ ఆఫ్ ఎగ్జామి నేషన్స్ ఆచార్య కె.ఎస్.వి కృష్ణారావు స్కాలర్ నవీన్‌కు పీహెచ్డీ నోటిఫికే షన్‌ను ప్రకటించారు. నవీన్ రాసిన పరిశో ధన పత్రాలు పలు జర్నల్స్‌లో ప్రచురితమ య్యాయి. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా నవీన్‌ను పలువురు అభినందించారు.

స్టేట్ బేస్ బాల్ బాలికల విభాగంలో విన్నర్‌గా కడప జిల్లా జుట్టు

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: మండలం బుడుగుంటపల్లి పంచాయతీ పరిధిలోని గవర్నమెంట్ హైస్కూల్ క్రీడా మైదానంలో నవంబర్ 15, 16, 17 తారీఖులలో మూడు రోజుల పాటు హోరాహోరీగా జరిగిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేస్ బాల్ పోటీలలో 13 జిల్లాల నుంచి బాల,బాలికల జట్లు పాల్గొన్నాయి. బాలికల విభాగంలో కడప జిల్లా జట్టు విన్నర్, గుంటూరు జిల్లా జట్టు రన్నర్ గా నిలిచారు.బాలుర విభాగంలో శ్రీకాకుళం జట్టు విన్నర్, కర్నూల్ జిల్లా జట్టు రన్నర్ గా నిలిచారు. గెలిచిన జట్లకు బహుమతులు ప్రదానం చేసి అబినందించారు. ఆంధ్రప్రదేశ్ లోని అన్ని జిల్లాల నుంచి ప్రతిభ గల క్రీడాకారులను సెలక్షన్ కమిటీ ఎంపిక చేసింది. బాలుర విభాగం నుంచి 16 మందిని, బాలికల విభాగం నుంచి 16 మందిని బేస్ బాల్ జట్లను ఎంపిక చేయడం జరిగిందని కడప జిల్లా ఎస్ జిఎఫ్ అండర్ 19 సెక్రటరీ చంద్రమోహన్ రాజు తెలిపారు.ఎంపికైన జట్లు 2026 జనవరిలో ఢిల్లీలో జరిగే 69వ జాతీయ బేస్ బాల్ పోటీలలో పాల్గొంటారన్నారు. బేస్ బాల్ పోటీల నిర్వహణ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బేస్ బాల్ టోర్నమెంట్ అబ్జర్వర్ దాదాఫీర్, ప్రిన్సిపాల్ యశోధర, హైస్కూల్ హెచ్ఎం ఉమాశంకర్, కడప జిల్లా పిడిలు నాగేశ్వరరెడ్డి, మురళీ కృష్ణారెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లోని బేస్ బాల్ కోచ్ మేనేజర్లు, విశ్రాంత పిడిలు సుబ్బరాజు, శారధ తదితరులు పాల్గొన్నారు.

పెద్దనపాడులో 'అల్లసాని పెద్దన' విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: ఆంధ్ర కవిత్వ చరిత్రలో యుగపురుషుడు, ఆంధ్ర కవితా పితామహుడు, తెలుగులో తొలి ప్రబంధానికి శ్రీకారం చుట్టిన అఖండ ప్రజ్ఞాశాలి అల్లసాని పెద్దన నడయాడిన పెద్దన పాడు గ్రామం లో అల్లసాని పెద్దన విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి అన్నారు. 2026 జనవరి మూడవ తేదీన జరిగే అల్లసాని పెద్దన విగ్రహ మహోత్సవ ఆవిష్కరణ సందర్భంగా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ కీ.శే. కొత్తపు యర్రపు రెడ్డి, లక్ష్మమ్మ మనుమడు గంగా చైతన్య కుమార్ రెడ్డి జ్ఞాపకార్థం ఎర్రగుంట్ల మండలం కోడూరు గ్రామ వాస్తవ్యులు కొత్తపు రామమోహన్ రెడ్డి, కళావతమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారని, ప్రసిద్ధ సినిమా నటులు, రచయిత, నాటక కర్త, ఆధ్యాత్మిక చింతనాపరుడు తనికెళ్ల భరణి విగ్రహావిష్కరణ చేస్తారని, ఈ సందర్భంగా అల్లసాని పెద్దన జీవితం- సాహిత్యంపై ప్రత్యేక సంచిక ను తెస్తున్నామని, శతాధిక కవి సమ్మేళనాన్ని ఏర్పాటు చేశామని అన్నారు. విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్న కొత్తపు రామమోహన్ రెడ్డి మాట్లాడుతూ విజయనగర సామ్రాజ్యపు పుర వీధుల్లో శ్రీకృష్ణదేవరాయలతో సమానంగా ఊరేగిన అల్లసాని పెద్దన నివాస స్థలం కడప జిల్లా కమలాపురం తాలూకా పెద్దనపాడు గ్రామం కావడం మన అదృష్టమని, ఆనాటి ప్రజలు ఒక నూతన సాహిత్య ప్రక్రియకు ఎదురుచూస్తున్నారని గ్రహించిన పెద్దన మార్కండేయ పురాణం ఆధారంగా 800పద్యాలతో మనుచరిత్రను అద్భుతంగా రచించి రాయల వారితో 'ఆంధ్రకవితా పితామహా 'అని పిలిపించుకున్న అల్లసాని పెదన విగ్రహాన్ని ఆయన నివసించిన గ్రామంలో తన ఆధ్వర్యంలో ఆవిష్కరించబడడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానన్నారు. ఆరోజు జరిగే శతాధిక కవి సమ్మేళనంలో పాల్గొనే కవులు అల్లసాని పెద్దన జీవితం-సాహిత్యంపై పద్యాలు లేక కవితల రూపంలో డిసెంబర్ 5 వ తేదీ లోపల పంపాలని, కవితలు పంపాలనుకునేవారు 7700003399 నంబర్‌కు వాట్సప్ చేయాలని, ఎంపికయిన కవితలను గ్రంథ రూపంలో ప్రచురిస్తామన్నారు.